
# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 128 పేజిలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం- 14 - మే - 2025


## హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్




- 43. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.
- ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లను వదిలేసి అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటరిచ్చారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల లెక్కలను విడుదల చేశారు ఉత్తమ్. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. 43. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

## దేశంలో ఎక్కడా
# ఇలాంటి పథకం లేదు'

- భారతదేశంలో ఇలాంటి పథకం ఎక్కడా లేదు.
- 'పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు.
- తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో పది ఏండ్లు గడిపింది.
- మిగిలిన ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాం.
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చాం.




భద్రాద్రి కొతగూడెం జిల్లా. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం పథకం వరం లాంటిదన్నారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. భద్రాద్రి కొతగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఈ మేరకు మాట్లాడారు. 'పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో పది ఏండ్లు గడిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చాం.

## పార్టీ మార్పుపై హరీష్ రావు
# సంచలన వ్యాఖ్యలు




- బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు.
- పార్టీ మారుతానని.. జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని సూచించారు.
- కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు.

అమరావతి: పార్టీ మార్పుపై వచ్చే ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో

## ఆపరేషన్ సిందూర్'పై 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

- 70 దేశాల దౌత్యాధికారులకు రక్షణ నిఘా సంస్థ డీజీ వివరణ
- లక్ష్యాల ఎంపిక, భారత సైనిక సామర్థ్యం, తప్పుడు ప్రచార ఖండనపై స్పష్టత
- కేంద్ర మంత్రివర్గం, పార్లమెంటరీ కమిటీకి కూడా ఆపరేషన్ వివరాలు







## భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు
# మట్టిలో కలిసిపోయాయన్న మోదీ

### పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు.

- భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు.
- ఆపరేషన్ సిందూర్ భారత ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిదన్న మోదీ,
- భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని మోదీ వెల్లడించారు.
- ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం




ఢిల్లీ: భారత్ మాతా కీ జై అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలను అంకితం చేస్తామని మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాల కారణంగా ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతిధ్వనులు ప్రపంచవ్యాప్తంగా వినబడుతున్నాయని మోదీ చెప్పారు. భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయని మోదీ వ్యాఖ్యానించారు. భారత క్షిపణులు, డ్రోన్లు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని, పాక్‌లో ఎక్కడ కూడా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని మోదీ అన్నారు. పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు.

## జిల్లాలో 2 రోజులు భారీ వర్షాలు..
# ఆ జిల్లాల్లో మండనున్న ఎండలు..






ఓవైపు వానలు దంచికొడుతుంటూ..

మరోవైపు ఎండలు బంబేలిస్తున్నాయి..

పిడుగులతో కూడిన భారీవర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండాల్సిన సమయంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది.. ఓవైపు వానలు దంచికొడుతుంటూ.. మరోవైపు ఎండలు బంబేలిస్తున్నాయి.. ఇక, రానున్న రెండు రోజుల్లోను.. భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ

## మరిన్ని ఎస్-400లు కావాలి..
## రష్యాకు భారత్ అధికారిక అభ్యర్థన




- ఎస్-400 సామర్థ్యం యుద్ధ క్షేత్రంలోనే రుజువైన నేపథ్యంలో ఈ వ్యవస్థలు
- మరిన్ని కావాలంటూ భారత్ రష్యాను అధికారికంగా కోరినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.
- ఎస్-400లు మోహరించిన ఆదమ్‌పూర్ వైమానిక స్థావరాన్ని కూడా సందర్శించారు.
- 400 కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేస్తుంది.

## మన ఖజానా
# పెరగాలి

### అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- రాష్ట్ర ఆదాయానికి సీఎం చంద్రబాబు వ్యూహం
- లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు స్పష్టీకరణ
- పన్ను ఎగవేతలకు టెక్నాలజీతో చెక్!
- ఎర్రచందనం విక్రయంపై ప్రత్యేక కమిటీ
- నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు.
- పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత




అమరావతి : రాష్ట్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేడు సచివాలయంలో

## రాష్ట్రానికి వచ్చేందుకు
## 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి




- పరిశ్రమలకు రెడ్ కార్పెట్... ప్రతి సంస్థకు ఒక నోడల్ అధికారి
- నారా లోకేశ్ వినూత్న నిర్ణయం
- వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు
- రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

అమరావతి : రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్న సంస్థలకు సత్వర అనుమతులు, పూర్తిస్థాయి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.

## ఆపరేషన్ సిందూర్'పై
# 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

ఢిల్లీ: పీఓకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన కీలక వివరాలను అంతర్జాతీయ సమాజానికి భారత్ తెలియజేసింది. ఈ ఆపరేషన్ గురించి రక్షణ నిఘా సంస్థ (డీఐఏ) డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా సుమారు 70 దేశాలకు చెందిన దౌత్యాధికారులకు సమగ్రంగా వివరించారు. ఢిల్లీలోని రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, 'ఆపరేషన్ సిందూర్' కోసం లక్ష్యాలను ఏ విధంగా ఎంపిక చేశారో, ఈ ఆపరేషన్‌లో ప్రదర్శితమైన భారత సైనిక శక్తిసామర్థ్యాలను లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా దౌత్యవేత్తలకు వివరించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కొన్ని శక్తులు చేసిన తప్పుడు ప్రచారాన్ని, దాని వల్ల ప్రాంతీయ స్థిరత్వంపై పడే ప్రభావాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు. అటువంటి తప్పుడు సమాచారాన్ని భారత్ ఏ విధంగా సమర్థవంతంగా ఎదుర్కొందో కూడా ఆయన వివరించారు. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భవిష్యత్ భద్రతా వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించేందుకు బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. మరోవైపు, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను విదేశాంగ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘ సభ్యులతో కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.

# పార్టీ మార్పుపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

వచ్చిన వార్తలపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతానని జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని ఆయన సూచించారు. కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకత్వ భాధ్యలు అప్పగిస్తే స్వాగతిస్తానని, క్రమశిక్షణ గల కార్యకర్తగా కేసీఆర్ ఆదేశాలను తూచా తప్పక పాటిస్తానని క్లారిటీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకోవటానికి రైతులు కల్లాల్లో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ధాన్యం రాశులను వదిలేసి.. రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. అందాల పోటీల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉంటున్నారని.. పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదని సెటైర్లు వేశారు. రుణమాఫీ, రైతుబంధుపై సీఎం ఎందుకు రివ్యూ చేయటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రైతుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని, చనిపోయిన రైతులకు 25లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయనందుకు తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో, ఢిల్లీకి డబ్బులు పంపటంలో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని.. 48గంటల్లో కాదు కదా.. నెల రోజులకు కూడా రైతులకు డబ్బులు పడటం లేదని, ఐదు పైసలు కూడా బోనస్ కింద విడుదల చేయలేదని మండిపడ్డారు. పెట్టుబడి సాయం మెల్లగా.. ఏడాది పొడవునా ఇస్తామని భట్టి చెప్పటం సిగ్గుచేటి దూషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని నిప్పులు చెరిగారు. పది కిలోల తరుగు తీస్తున్నారని.. సీతక్క నియోజకవర్గంలో జట్టి రాజు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల కష్టాలపై సీఎం రేవంత్ సమీక్ష చేయడని.. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉండి.. వడదెబ్బతో రైతులు చనిపోతున్నారని ధ్వజమెత్తారు.

## భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు
# మట్టిలో కలిసిపోయాయన్న మోదీ

భారత వైమానిక స్థావరాలపై దాడులు చేసేందుకు పాక్ నిరంతరం ప్రయత్నించిందని ఐతే సరిహద్దుల ఆవలే మన త్రివిధదళాలు ఆ దాడులను తిప్పికొట్టాయని తెలిపారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపుర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ఆయన, సైనికులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిందన్న మోదీ, కేవలం 25 నిమిషాల్లో సరిహద్దు ఆవల ఉగ్ర స్థావరాలను కచ్చితంగా గురిచూసి కొట్టామని తెలిపారు. మన క్షిపణి రక్షణ వ్యవస్థ ముందు పాక్ డ్రోన్లు, క్షిపణులు, విమానాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయన్నారు. మన త్రివిధదళాలు చూపిన సామర్థ్యం ప్రపంచాన్ని నివ్వెరపరిచిందని తెలిపారు. మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని మోదీ వెల్లడించారు. ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడమని అన్నారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ ఎట్టిపరిస్థితుల్లనూ తలొగ్గదని అన్నారు. త్రివిధదళాలు ఎవరి బాధ్యత వారు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మానవశక్తి, యంత్రశక్తి మధ్య అద్భుతమైన సమన్వయంతో పని చేసినట్లు చెప్పారు. అంతకుముందు ఆదంపుర్ ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ముందు నిలబడి సెల్యూట్ చేశారు ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేన సిబ్బందితో ముచ్చటించిన వారిని అభినందించారు. దాదాపు గంటన్నరకుపైగా వైమానిక కేంద్రంలో గడిపిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వైమానిక దళ సిబ్బందితో కలిసి పెద్దపెట్టున భారత్ మాతాకీ జై, జై జవాన్ నినాదాలు చేశారు.

# దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు'

మిగిలిన ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. నిరుద్యోగ యువత తలెత్తుకొనేలా రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చాం. భారతదేశంలో ఇలాంటి పథకం ఎక్కడా లేదు. జూన్ రెండవ తేదీ కల్లా యువజన వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తాం. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయి. సిబిల్ స్కోర్ కు రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎలాంటి సంబంధం లేదు' అని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## జిల్లాలో 2 రోజులు భారీ వర్షాలు..
# ఆ జిల్లాల్లో మండనున్న ఎండలు..

మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కొన్నిచోట్ల పిడుగులతో కూడిన భారీవర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..

### అప్పుడు మాల్దీవులు, ఇప్పుడు టర్కీ.. ఇండియా దెబ్బకు విలవిల..

రేపు అనగా.. బుధవారం 14వ తేదీన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.. ఇక, శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, కోనసీమ, పల్నాడు , గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. ఈ సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. ఈ సమయంలో భారీ హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. ఇక, గురువారం రోజు అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. పల్నాడు, ప్రకాశం, నంద్యాల, వైఎస్సార్, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది.. మరోవైపు.. రేపు ఉష్ణోగ్రతలు 41-43 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని.. విజయనగరంలోని మూడు మండలాలు, పార్వతీపురంమన్యంలోని 8 మండలాలు, తూర్పుగోదావరిలోని ఒక మండలం.. మొత్తం 12 మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉండగా.. మరో 35 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్..

# హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్

ప్రతి విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీష్ కు ఉత్తమ్ హితవు పలికారు. ఒకసారి హరీష్ లెక్కలు చూసి మాట్లాడితే మంచిదని సూచించారు.

### ధాన్యం రాశులు వదిలేసి.. అందాల రాశుల చుట్టూ..

సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మరోసారి మండిపడ్డారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అందాల పోటీల్లో బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ ధాన్యం రాశులు వదిలేసి అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని చమత్కరించారు. రైతు సమస్యలపై సమీక్ష చేయడానికి సీఎం రేవంత్‌కు టైమ్ లేదని, రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

### ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ వ్యాఖ్యలకు కౌంటర్

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటరిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ లాగ కాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇందిరమ్మ ఇండ్ల కోటా ఇస్తామన్నారు పొంగులేటి. ఇక ఏపీలో కలిసిన ప్రజల స్థానికతపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

# మ్యాంగో మ్యాజిక్

మామిడి పళ్లలో రారాజుగా బీహార్‌కు చెందిన 'మాల్దా' రకం పేరు తెచ్చుకుంది. ఈ పండు తోలు చాలా పలుచగా ఉంటుంది. తోలు తీయగానే పాలలా మామిడి గుజ్జు బయటికి వస్తుంది. అందుకే ఈ పళ్లను దుధియా (పాల) మామిడి అంటారు. మనదేశంలో లభించే ఖరీదైన మామిడి పళ్లలో 'కేసర్' ఒకటి. ఈ పండు తోలుతో పాటు గుజ్జు కూడా లేత కేసరి రంగును పోలి ఉంటుంది. అందుకే ఆ పేరు. అహ్మదాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ రకం ఎక్కువగా పండుతుంది. జునాఘడ్ నవాబులు తొలిసారిగా 1931లో ఈ రకం మామిడిని పండించారు. ఆ తరవాత 1934లో వీటికి 'కేసరి' అని నామకరణం చేశారు. మహారాష్ట్రలోని సింద్‌దుర్గ్ జిల్లాలోని దేవ్‌గఢ్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మామిడి పళ్లను పండిస్తున్నారు. అవే 'ఆల్‌ఫాన్సో' మామిడి. రంగు, రుచి, వాసనల్లో వీటి తరవాతే ఏవైనా. అందుకే వీటి ధర ఎక్కువ. సింద్‌దుర్గ్‌తో పాటు రాయ్‌గఢ్, రత్నగిరి జిల్లాల్లో కొంకణి తీరంలో ఈ మామిడి పళ్లను విస్తృతంగా పండిస్తారు.

## మరిన్ని ఎస్-400లు కావాలి..
# రష్యాకు భారత్ అధికారిక అభ్యర్థన

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ: పాక్ దాడుల్ని దీటుగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ మిలిటరీ దళాల ప్రశంసలు పొందుతోంది. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కావాలంటూ భారత్ రష్యాకు అధికారికంగా విజ్ఞప్తి చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు రష్యా కూడా అంగీకరించే అవకాశం ఉందని సమాచారం. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిసైల్స్ వంటి వాటిని ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ దీటుగా ఎదుర్కొన్న విషయం తెలిసిందే. మార్గమధ్యంలోనే పాక్ డ్రోన్స్, మిసైళ్లను ఇది ధ్వంసం చేసింది. అత్యంత కచ్చితత్వంతో, ప్రభావశీలతతో ఈ వ్యవస్థ పనిచేసిందని డిఫెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కొనుగోలు చేసేందుకు భారత్ నిర్ణయించుకుంది. గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా రూపొందించిన ఎస్-400ను భారత్ సుదర్శన్ చక్ర పేరుతో మోహరించిన విషయం తెలిసిందే. మొత్తం ఐదింటిని కొనుగోలు చేసేందుకు 2018లో భారత్, రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. పాక్, చైనా నుంచి ముప్పు పొంచి ఉన్న తరుణంలో భారత్ వీటి కొనుగోలుకు మొగ్గు చూపింది. 2021లో తొలి ఎస్-400ను పంజాబ్‌లో మోహరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి భారత్‌కు ఈ ఐదు సమకూరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్-400 ద్వారా నాలుగు రకాల మిసైళ్లను ప్రయోగించి శత్రదేశ డ్రోన్లు, యుద్ధ విమానాలు, క్రూయిజ్, బాలిస్టిక్ మిసైళ్లను ధ్వంసం చేయొచ్చు. ఇందులోని అత్యాధునిక ఫేజ్డ్ అరే రాడార్ ఒకేసారి 100 మిసైళ్ల ప్రయాణమార్గాన్ని గమనిస్తూ దాడులు చేయగలదు. శత్రదేశ మిసైళ్లు, యుద్ధ విమానాలు 600 కిలోమీటర్ల దూరంలో ఉండగానే ఇది గుర్తిస్తుంది. 400 కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేస్తుంది. వీటికి మొబైల్ లాంచర్లు కూడా అందుబాటులో ఉండటంతో యుద్ధ క్షేత్రంలో కావాల్సిన చోట రంగంలోకి దింపే అవకాశం కూడా ఉంది. ఎస్-400 ముప్పు ఉండటంతో పాక్ యుద్ధ విమానాలు అనేకం మార్గమధ్యంలోనే వెనక్కు మళ్లాల్సి వచ్చింది. తాజాగా ప్రధాని మోదీ.. ఎస్-400లు మోహరించిన ఆదమ్‌పూర్ వైమానిక స్థావరాన్ని కూడా సందర్శించారు. తద్వారా పాక్ వ్యాపిస్తున్న వందంతులకు చెక్ పెట్టారు.

# రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

మొదటి పేజి తరువాయి




రాష్ట్రంలో రూ.91,839 కోట్ల పెట్టుబడితో, 1,41,407 ఉద్యోగాలను కల్పించేందుకు సుమారు 91 దిగ్గజ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై ఇవాళ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని స్పష్టం చేశారు. దీనివల్ల అనుమతుల ప్రక్రియ వేగవంతమై, సంస్థలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలవుతుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం నగరాన్ని అత్యాధునిక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా, 'మన మిత్ర' యాప్‌లో అందుబాటులో ఉన్న 317 సేవలను నెలాఖరు నాటికి 400కు పెంచాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ధృవపత్రాలకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్ సాంకేతికత జోడించాలని, పన్నుల బకాయిల వివరాలను వాట్సాప్ ద్వారా తెలిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్‌లో డేటా పాయింట్లు, కేపీఐలను ఇంటిగ్రేట్ చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో పొందుపరచాలన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే వ్యవస్థను పటిష్టం చేయాలని, విశాఖలో జూన్ 9, 10 తేదీల్లో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఏకీకృతం చేసి, కృత్రిమ మేధ (ఏఐ) జోడించి ఒకే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సరళతరం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని జీవోలు, యాప్‌లను ఒకే వేదికపైకి తెచ్చి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మన ఖజానా పెరగాలి


మొదటి పేజి తరువాయి

ఆదాయార్జన శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, గత మూడు దశాబ్దాల ఆదాయ సరళిని లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,34,208 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎం తెలిపారు. పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని శాఖల సమాచారంతో 'డేటా లేక్' ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఎగవేతలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బంగారం కొనుగోళ్లలో రాష్ట్రం ముందున్నప్పటికీ, పన్నుల రూపంలో ఆశించిన ఆదాయం రాకపోవడంపై దృష్టి సారించాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలకు, దాని విలువ నిర్ధారణకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి ఒక వరం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. కమిటీ ద్వారా ఎర్రచందనం నిల్వలు, వాటి విలువపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత ఉండేలా రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ ఆదాయం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉండటంపై దృష్టి సారించి, ఆదాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మే 11 నాటికి కేంద్రం నుంచి రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇది గత ఏడాదితో పోలిస్తే 26 శాతం తక్కువని అధికారులు సీఎంకు వివరించారు. ఆదాయార్జన శాఖలన్నీ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి, రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# దేశ ప్రజల్లో ఎన్నో ఆశలను రేకెత్తించింది.




పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. ఆ ఉగ్రదాడికి కారణమైన, ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పే ఉద్దేశంతో ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులందరినీ మట్టుబెడతారని, తద్వారా పహల్గాంలో అమరులైన అమాయక పర్యాటకుల ఆత్మ శాంతిస్తుందని, ఉగ్ర స్థావరాలకు అడ్డాగా మారిన పాకిస్థాన్ నుంచి ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, తద్వారా భవిష్యత్తులో ఇక అక్కడి నుంచి ఉగ్రవాదుల చొరబాట్లు ఉండవని ప్రజలు భావించారు.

సింధూ నది నీళ్లను ఆపివేసిన తర్వాత పాక్ కరువు కోరల్లో చిక్కుకొని కాళ్ల బేరానికి వస్తుందనే ప్రచారాలనూ దేశ ప్రజలు విశ్వసించారు. 1971లో బంగ్లా ఏర్పాటు చేసినట్టు బలుచిస్థాన్ ఏర్పాటువరకు మోదీ ప్రభుత్వం వెనుకడుగు వేయదని గాఢంగా నమ్మారు. దేశాన్నేలిన గత ప్రభుత్వాలు, పార్టీల చేతికానితనం వల్లె పాకిస్థాన్ రెచ్చిపోతుందని, నెహ్రూ తప్పిదం వల్లనే కశ్మీర్ సమస్య ఏర్పడిందని, ఇప్పుడు మోదీ పాక్‌కు బుద్ధి చెప్తాడని బీజేపీ ప్రచారం చేసింది. దానితో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి మోదీ కోసమైనా భారత్‌కు మద్దతు పలుకుతారని ప్రజలు నమ్మారు. అందుకే ఆపరేషన్ సిందూర్‌కు దేశ ప్రజలు మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం తమ రాజకీయ విభేదాలు, సైద్ధాంతిక వైరుధ్యాలను పక్కనబెట్టి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. వరల్డ్ బ్యాంక్ (ఐఎంఎఫ్) మన అభ్యంతరాన్ని పెడచెవిన పెట్టి పాక్‌కు అప్పు ఇవ్వడం ద్వారా ముందే సంకేతాలిచ్చింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా విఫలమైంది. ఇక ఆపరేషన్ సిందూ ర్ జరిగిన మూడు రోజులు ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, ఫైసలాబాద్, గుజర్న్‌వాలా, పెశావర్, క్వెట్ట, రావల్పిండి, సియాల్కోట్, సర్గోద, బహావల్‌పూర్ వంటి పాక్‌లోని ప్రధాన పట్టణాలు మన సైన్యం చేసిన దాడులతో అతలాకుతలమయ్యా యి. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎయిర్ బేస్ లులంచ్ ప్యాడ్‌లు అన్ని ధ్వంసమయ్యాయి. మన దేశం ఇన్ని విజయాలు సాధించిన తర్వాత అమెరికా ఒత్తిడితో కాల్పుల విరమణకు ఒప్పుకోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏ శాంతి ఒప్పందం లేకుండా, ఉగ్రవాదులను అప్పగించకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకున్నారో దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పాలి. పక్కలో బల్లెం లాంటి పాకిస్థాన్ పీక పిసికే ఒక సువర్ణావకాశాన్ని అమెరికా ఒత్తిడికి తలొగ్గి మాత్రమే వదులుకున్నామా? అనేది దేశ ప్రజల ముం దున్న అతిపెద్ద ప్రశ్న. 1971లో కూడా పాకిస్థాన్‌కు మద్దతుగా దాడి చేస్తామని అమెరికా బెదిరించింది. ఆ బెదరింపులను లెక్కచేయని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయడాన్ని జనం ఇప్పుడు గుర్తు కు తెచ్చుకుంటున్నారు. ఈ కాల్పుల విరమ ణ కూడా మన దేశ ప్రధాని కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించడం యావత్ దేశానికే అవమానకరంగా ఉన్నది. ఆధునిక యుగంలో యుద్ధం ఎలా ఉన్నా దౌత్యనీతి, రాజనీతి ద్వారా మాత్రమే శత్రువును మన కాళ్ల దగ్గరికి తీసుకురాగలమని, ప్రజలను మతపరమైన భావోద్వేగాల కు గురిచేసి ఓట్లు దండుకున్నంత సులువుగా ప్రపంచ దేశాలు మనకు అండగా ఉంచుకోలేమని గుర్తెరగాలి. అంతేకాకుండా అమెరికా లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీత వేస్తాయి కానీ, ఆలింగనాలకు మిత్రులైపోయి మనకు సహకరిస్తాయనుకోవడం అవివేకమే అవుతుంది. చరిత్రలో మనకంటే ముందు దేశా న్నేలిన ప్రధానులు, ప్రభుత్వాలు కూడా అప్పటి కాలమాన, దేశ అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకున్నారు తప్ప బీజేపీ ప్రచారం చేసినట్టు వారికి ధైర్యం లేక కాదు, రాజనీతిజ్ఞత తెలువక కాదు. గత ప్రభుత్వాలను నిందించడం సులువే కానీ, ప్రభుత్వంలలో ఉండి సంక్షోభాలు ఏర్పడినప్పుడు దేశాన్ని విజయం వైపు నడిపించడం అంత సులువు కాదన్న విషయాన్ని బీజేపీ నాయకులు, శ్రేణులు ఇకనైనా గమనించాలి. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా జోక్యానికి అవకాశం ఇచ్చి మన దేశ అంతర్గత సమస్య అయిన కశ్మీర్ విషయంలో ఇతర దేశాలకు అవకాశం ఇచ్చినట్టయింది.

# సంపాదకీయం

## అనుకున్నది సాధించాం, అప్రమత్తంగా ఉందాం

భారత్ పాకిస్థాన్ తాజా యుద్ధస్థితి ఉభయ దేశాల భావి సంబంధాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి యావద్భారతీయులను అమితంగా కలచివేసింది. ఆ హతులు అందరూ ఆసేతు హిమాచలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులను భగ్నం చేసి, ఆ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక రంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే కుతంత్రంతో జరిగిన ఉగ్రవాద దాడిపై సమస్త భారతీయుల ఆగ్రహావేశాలు, భావోద్వేగాలలో కేంద్ర ప్రభుత్వమూ పాలుపంచుకున్నది. 2016లో ఉరి, 2019లో పుల్వామా ఉగ్రవాద ఘాతుకాలు సంభవించినప్పుడు భారత్ శక్తిమంతమైన, ప్రభావదాయకమైన ప్రతిచర్యలు చేపట్టింది. భవిష్యత్తులోనూ ఎలాంటి ఉగ్రదాడులకైనా అటువంటి ప్రతిస్పందనలు ఖాయమని ఆ ప్రతి దాడులతో భారత్ స్పష్టం చేసింది. పహల్గాం పాశవికకాండకు మరింత కఠినమైన గుణపాఠాన్ని నేర్పాలని భారత్ దృఢంగా సంకల్పించుకున్నది. ఆ సంకల్పసాధనలో భాగంగా తొలుత భారత్‌లోని పాకిస్థానీ జాతీయుల వీసాలను రద్దు చేసిందిబీ దశాబ్దాలుగా అమల్లో ఉన్న, పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన సింధునదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయాలతోనే పహల్గాంపై తన ప్రతీకార చర్య ఎంత కఠినంగా ఉండేది భారత్ తేటతెల్లం చేసింది. మే 7 ప్రాతఃకాలంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రదేశాల (పాకిస్థాన్‌లో నాలుగు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఐదు)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత వాయుసేన క్షిపణి దాడులు నిర్వహించింది. పహల్గాం ఊచకోత అనంతరం పాకిస్థాన్ సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మన సైనిక దళాలు ఎంచుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడంలో సంపూర్ణంగా సఫలమయ్యాయి. పాకిస్తాన్ పంజాబ్ రాష్ట్రంలోని బహ్వాల్‌పూర్ (జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయమున్న నెలవు), మురిద్కే (లష్కరే తయిబా ప్రధాన స్థావరమున్న ప్రదేశం) పట్టణాలపై జరిగిన ఆ మెరుపుదాడులు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో వెల్లడించాయి. పాకిస్థాన్ ఆధారిత, ప్రేరేపిత ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా సరే వారిని శాశ్వతంగా మట్టుబెట్టి తీరాలన్న భారత్ దృఢసంకల్పాన్ని అవి విశాల ప్రపంచానికి, మరీ ముఖ్యంగా ఇస్లామాబాద్ పాలకులకు ఎటువంటి మినహాయింపులు లేకుండా చాటిచెప్పాయి. తన భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. భారత్%-%పాకిస్థాన్ సంబంధాల శబ్ద కోశంలో అదొక ప్రభావదాయక సూత్రంగా ఖాయమయింది. ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధచర్యే అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు. పాకిస్థాన్ పట్ల మన దౌత్యనీతిలో ఒక కొత్త ఆలోచనకు, కచ్చితమైన ఆచరణకు మోదీ సిద్ధాంతం ప్రాతిపదికగా నిలుస్తుంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత జగడానికి పహల్గాంలో ఉగ్రవాద ఘాతుకమే ప్రధాన కారణం. ఆ దాడికి ప్రతి స్పందనగా మనం చేపట్టిన దాడులు చర్య%-%ప్రతిచర్య క్రమంలో కీలకమైనవి. భారత్ తన ప్రతిచర్యలను జయప్రదంగా నిర్వహించి, పాక్ మద్దతుతో చెలరేగిపోతున్న ఉగ్రవాదుల గర్హనీయమైన మానవతా వ్యతిరేక నేరాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లడంలో సఫలమవ్వడం ఇస్లామాబాద్ పాలకులకు ఎంతైనా ఆగ్రహం తెప్పించింది. తత్ఫలితంగానే పాక్ సైనిక దళాలు భారత్‌పై తెగబడి దాడులు చేశాయి. కాల్పుల విరమణను సైతం ఉల్లంఘించి పరిస్థితులను మరింత విషమింపజేస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాద మూకలు భవిష్యత్తులో పాల్పడే ఎటువంటి దాడులనైనా యుద్ధ చర్యలుగా పరిగణించి అందుకు అదే రీతిలో దీటుగా ప్రతిస్పందించడం ఒక సూత్రంగా ఇప్పుడు స్థిరపడింది. పాకిస్థాన్ మరింత భారీగా నష్టపోయేలా యుద్ధ చర్యలను కొనసాగించాలని ప్రభుత్వ విమర్శకులు పలువురు వాదిస్తున్నారు. అయితే ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడంలో భారత్ మౌలిక లక్ష్యం తమ భూభాగాలలో ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి తీరుతామని నొక్కిచెప్పడమేనన్న విషయాన్ని ఆ విమర్శకులు విస్మరిస్తున్నారు. భారత్ తన లక్ష్యసాధనలో సందేహాతీతంగా జయప్రదమయింది. ఇక యుద్ధ చర్యలకు స్వస్తిచెప్పి మన ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టి కేంద్రీకరించాలి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత సంఘర్షణను సైనిక వ్యవహారాల నిపుణులు జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. ఈ 'యుద్ధా'నుభవాల ప్రాతిపదికన మనం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైనిక బలాధిక్యత తిరుగులేని రీతిలో రుజువయింది. మన వాయుతల రక్షణ వ్యవస్థలు అన్నీ ప్రశస్తంగా పనిచేశాయి. మన వాయుసేన ఎదురులేని రీతిలో పాక్ వాయుతలంలోకి ప్రవేశించి ఎంపిక చేసుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా తుదముట్టించడం జరిగింది. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న వ్యవస్థలను ధ్వంసం చేయడమే భారత్ అసలు లక్ష్యమని, పాకిస్థాన్‌ను విస్తృతంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడం జరిగిందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. త్రివిధ సాయుధ బలగాల మధ్య పటిష్ఠ సమన్వయంతో పాక్‌పై ప్రతిదాడులు జరిగాయి. మన సాయుధ బలగాలకు ఇదొక కొత్త అనుభవం. మన దేశ రక్షకులు ఇంతకు ముందు చూడని, పాల్గొనని వినూత్న యుద్ధ తంత్రమది. ఆపరేషన్ సిందూర్ మన సాయుధ బలగాలకు ఒక శుభశకునం. భావి యుద్ధాలు, త్రివిధ దళాలు విడివిడిగా కాకుండా ఒక ఏకీకృత కమాండ్ ఆధ్వర్యంలో జరిగే సమరాలుగా ఉంటాయి.

# దృఢనిశ్చయం



ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి శషభిషలూ లేకుండా కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ వాణిజ్యం అంటే కుదరదని, ఉగ్రవాదానికి ఊతమిస్తూ నీళ్లు కావాలంటే చెల్లదని, ఉగ్రవాదానికి అండదండలందిస్తూ చర్చలంటే అంగీకరించబోమని, అణు బెదిరింపులు తమను భయపెట్టలేవని మోదీ పంపిన సందేశంతోనైనా పాకిస్తాన్ ఇకపై బుద్ధెరిగి ప్రవర్తించాలి. జాతినుద్దేశించి సోమవారం ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతమూ కశ్మీర్ విషయంలో పాక్ తీరుతెన్నులపై భారత్ వైఖరిలో వచ్చిన మార్పునకు అద్దం పట్టింది. ఒక కొత్త క్రమం బయల్దేరిందన్న సంకేతాన్నిచ్చింది. ఇకపై ఉగ్రవాదులనూ, వారికి సాయం చేసే ప్రభుత్వాన్నీ వేర్వేరుగా పరిగణించబోమని ఆయన ప్రకటించటం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాదు...ప్రపంచ దేశాలన్నీ గమనించాల్సిన అత్యంత కీలక అంశం. కాల్పుల విరమణ తాత్కాలిక దశేనని, ఉగ్రవాదం శిరసెత్తినప్పుడల్లా 'ఆపరే షన్ సిందూర్' కొనసాగుతూనే వుంటుందని మోదీ చెప్పటం గమనార్హం. ఉగ్రవాదం విషయంలో అమెరికా నిర్లిప్తంగా ఉంటున్నది. 2001లో తమ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు 'ఉగ్ర వాదంపై యుద్ధం' పేరిట ప్రపంచంలో ఎక్కడున్నా ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని ప్రక టించిన అమెరికా... కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌ను ఎప్పటికప్పుడు వెనకేసు కొస్తోంది. మొన్నటికి మొన్న పాక్‌కు ఐఎంఎఫ్ అప్పు పుట్టడంలో యథోచితంగా సహకరించింది. దాని చీకటి వ్యవహారాలు తెలియనట్టే ప్రవర్తిస్తూ ఎప్పటికప్పుడు నిధులూ, ఆయుధాలూ ఉదారంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని మోదీ ప్రకటించాల్సి వచ్చింది. దారుణ ఉదంతాలు జరిగినప్పుడల్లా ఏదో కారణం చూపి పాకిస్తాన్‌ను గట్టెక్కి స్తున్న దేశాలు ఇకముందు దీన్ని గమనించుకోక తప్పదు. ఎంతటి క్లిష్టసమయాల్లోనైనా పట్టువిడుపులు ప్రదర్శించటంలోనే పరిణతి వ్యక్తమవుతుంది. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ధ్వంసం చేయటంలోనూ, అక్కడి సైన్యం ప్రతిఘటనను తిప్పికొట్టడంలోనూ తెగువనూ, సాహసాన్నీ చూపిన భారత్... లక్ష్యసాధన పూర్తికాగానే కాల్పుల విరమణకు కూడా సిద్ధపడి తన పరిణతిని తెలియజెప్పింది. కానీ విఫల రాజ్యం అనే పేరును సార్థకం చేసుకుంటూ కాల్పుల విరమణకు ఒప్పుకున్నట్టే ఒప్పుకుని ఆ వెంటనే ఉల్లంఘించి పాక్ తన నైజాన్ని చాటుకుంది. ఆ దేశంలో రాజకీయ నాయకత్వానికీ, సైన్యానికీ ఎప్పుడూ సరైన సంబంధాలు ఉండవన్నది ప్రపంచానికి తెలిసిన సత్యం. కానీ సైనిక దళాలు సైతం ముఠాలుగా చీలివున్నాయని, వాటిపై ఎవరికీ అదుపులేదని తాజా పరిణామాలు నిరూపించాయి. ఈ నిజాన్ని గ్రహించకుండా, పాకిస్తాన్‌కు చీవాట్లు పెట్టకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అణు యుద్ధాన్ని నివారించామని స్వోత్కర్షకు పోవటం... భారత్, పాక్‌లను ఒకే గాటన కట్టడం ఆశ్చర్య కరం. పాకిస్తాన్ చర్యల పర్యవసానం తమ వరకూ రానేరాదన్న భ్రమేదో ఆయనకున్నట్టుంది. కానీ ఉగ్రవాదాన్ని దుంపనాశనం చేయకపోతే అది ఏ దేశాన్నీ విడవకుండా మింగేస్తుందని ట్రంప్ గ్రహించటం అవసరం. ఉగ్రముఠాలను ప్రోత్సహించి ఊచకోతలను సాగిస్తున్న దేశాన్ని ఎవరైనా ఎలా ఉపేక్షించగలరు? దాని దగ్గర అణ్వాయుధాలున్నాయనీ, అది ముప్పు కలిగిస్తుందనీ... కనుక నోర్మూసుకు పడివుండాలనీ ట్రంప్ చెప్పదల్చుకున్నారా? వాణిజ్యాన్ని ఆపేస్తానని బెదిరించటంవల్ల రెండు దేశాలూ దారికొచ్చి కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయని ఆయన అనటం కూడా అత్యంత అభ్యంతరకరమైంది. ఇలాంటి తర్కంతో ప్రోత్సహిస్తున్నదెవరినో గమనించుకుంటున్నారా? తాను ప్రపంచ దేశాలతో అధిక సుంకాల పేరిట యుద్ధం సాగిస్తున్నారు. గాజాలో ఇజ్రాయెల్‌ను నియంత్రించటం లేదు. అక్కడి మారణకాండను ఆపటం లేదు. మరి భారత్ పాక్ విషయంలో ఇంత ఆత్రుత దేనికో? ఎవరూ కోరకుండానే కశ్మీర్ సమస్యలో వేలెడతానని ఆయన తనకు తానుగా ఎలా చెప్పుకుంటారు? 2019లో సైతం ట్రంప్ ఇవే తరహా మాటలు మాట్లాడారు. ఆ తర్వాత జ్ఞానో దయమై ఆ సమస్యను రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకుంటాయని స్వరం మార్చారు. మళ్లీ ఇప్పుడేమైంది? తాజా ఘర్షణలకు మూలం ఎక్కడున్నదో ఆయన గ్రహించలేకపోయారని ట్రంప్ మాటలు గమనిస్తే తెలుస్తుంది. పహల్గామ్‌లో 26మంది పర్యాటకుల్ని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ని ప్రారంభించింది. పాక్‌లోని 24చోట్ల ఉగ్రముఠాల స్థావ రాలను ధ్వంసం చేసింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికిది ప్రతీకారమే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారాన్ని ఉద్దేశించి మొదలెట్టిన దాడులు కాదు. అమెరికాకు చిత్తశుద్ధి ఉంటే ఉగ్రవాదులకు ప్రోత్సాహం అందించినంతకాలమూ తమ వైపుగా ఎలాంటి సాయమూ అందబోదని పాకిస్తాన్‌కు చెప్పాలి. ఆ దేశంతో సంబంధ బాంధవ్యాలు కొన సాగించే దేశాలపై కూడా ఆంక్షలుంటాయని ప్రకటించాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ దేశం కారణంగా నష్టపోతున్న భారత్‌నూ, దాన్నీ ఒకే గాటన కట్టడం ఎలాంటి సందేశం పంపుతుంది? ఇరు దేశాల మధ్యా చర్చలంటూ ఉంటే అది కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనా, ఉగ్రవాదుల అప్పగింతపైనా మాత్రమే ఉంటాయని తన సందేశంలో మోదీ చెప్పటం ప్రశంసించదగ్గది. అమెరికా పోకడలు గమనిస్తే వర్తమాన ప్రపంచంలో ఎలాంటి న్యాయం అమలవుతున్నదో స్పష్టంగానే అర్థమవుతుంది. దశాబ్దాలుగా చీకాకు పెడుతున్న ఉగ్రవాద సమస్యపై మోదీ దృఢ నిశ్చయాన్ని ప్రకటించటం ఈ తరహా న్యాయాన్ని ప్రశ్నించటమే!

# కగార్‌పై కొత్త ప్రతిపాదనలు



'ఆపరేషన్ కగార్' కాల్పుల విరమణను కోరుతూ మావోయిస్టు పార్టీ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనకు భిన్నంగా ఇప్పుడు కొన్ని కొత్త ప్రతిపాదనలు ముందుకువచ్చాయి. 'శాంతి చర్చల కో ఆర్డినేషన్ కమిటీ' పేరిట వచ్చిన ఆ ప్రతిపాదనలో గమనార్హమైన విశేషం ఒకటున్నది. శాంతిచర్చలు జరగవలసింది తమకు, ప్రభుత్వానికి మధ్య అన్నది మావోయిస్టుల వైఖరి కాగా, వారితో మాత్రమే కాదని, ఆదివాసీలతో, పౌరహక్కుల వారితో కూడానని ఈ కమిటీ కోరుతున్నది. ఈ మాటల అర్థ తాత్పర్యాల్లోకి వెళ్తే మనకు అనేకం కన్పిస్తాయి. ఆ చర్చలోకి వెళ్లేముందు కొన్ని మాటలు చెప్పుకోవాలి. కమిటీ వారు తమ లేఖను కేంద్ర ప్రభుత్వానికి గాక కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు రాశారు. కాల్పుల విరమణ కోసం కేంద్రాన్ని ఒత్తిడి చేయాలని, ఈ విషయం 'ఇండియా' కూటమిలోని పార్టీల దృష్టికి కూడా తీసుకువెళ్లాలని కోరారు. ఈ మేరకు ఖర్గే ఏమి చేయగలరో వేచి చూడవలసి ఉంటుంది. కమిటీ లేఖలో కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రస్తావనలు మాత్రమే లేవు. 'దశాబ్దాలుగా ఆ ప్రాంతాల్లో కొనసాగుతున్న దోపిడీ, భూముల స్వాధీనం, ప్రజా సమస్యల పట్ల వ్యవస్థల నిర్లక్ష్యం, తదితర కారణాల వల్ల ఈ విపత్కర పరిస్థితి తలెత్తటం' అనే ముఖ్యమైన మాట ఉన్నది. అదేవిధంగా, 'ఆదివాసీల రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతూ జైలుపాలైన ఆదివాసీ నేతలు, ఇతర హక్కుల నేతల' గురించి కూడా పేర్కొన్నారు. నక్సలిజం విషయం ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకు గల కారణాలు, చరిత్ర చాలా ఉన్నాయి. అది తేలికగా తేలేది కాదు. కేవలం కాల్పులు, వాటి విరమణలకు పరిమితమైనది కాదు. ఇదంతా రాయటం ఎందుకంటే, ఆదివాసీ ప్రాంతాల్లో 'దశాబ్దాలుగా' జరుగుతున్నదంటున్న దానిలో ఆరంభ పాత్ర, దీర్ఘకాలపు పాత్ర మల్లికార్జున ఖర్గే పార్టీది. అందువల్ల కమిటీ వారు సమస్యను ఆ పార్టీ దృష్టికి తీసుకుపోరాదని అనటం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర తప్పదు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఒకవైపు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కాల్పుల విరమణకు ప్రయత్నిస్తూనే, మరొకవైపు అసలు నక్సలిజానికి కారణాలు? తాము పాలించిన దశాబ్దాల కాలంలో వాటి పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు? వాటి నికర ఫలితాలు? ఆ ఉద్యమం అణచివేతకు స్వయంగా తాము తీసుకున్న చర్యలు 'ఆపరేషన్ కగార్'కు ఏ విధంగా భిన్నమైనవి? నక్సలిజం సమస్య పరిష్కారానికి తమతో పాటు తమ 'ఇండియా' కూటమి మిత్రుల సమగ్రమైన విధానం ఏమిటి? దానిని తాము పాలిస్తున్న రాష్ట్రాలలో అమలుపరచగలరా? ఒకవేళ భవిష్యత్తులో కేంద్రంలో అధికారానికి వచ్చినట్టయితే ఆ విధానం కొనసాగించగలరా? ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వానికి ఆ కోణం నుంచి చేయగల ప్రతిపాదనలేమిటి? అనేవి కూడా చర్చించి ఒక విధానం రూపొందించి, ఆదివాసీలకు, తక్కిన దేశానికి వివరించటం అవసరం. అప్పుడు, కాంగ్రెస్ పార్టీ వెనుకటి రికార్డు ఎట్లున్నా, భవిష్యత్తు గురించి, వారి విధానాలపై, నిజాయితీపై దేశం చర్చించి అర్థం చేసుకునేందుకు, వారిని నమ్మాలో లేదో తేల్చుకునేందుకు వీలు కలుగుతుంది. లేనట్టయితే, ఏఐసీసీ అధ్యక్షుడు అనేకానేక ఇతర విషయాలలో వలెనే ఈ కమిటీ అంశంలో నూ కేంద్ర ప్రభుత్వానికి ఒక మొక్కుబడి లేఖ రా సి చేతులు దులుపుకోవటం అవుతుంది. ఇంత కూ కమిటీ వారు ఆయనకు నేరుగా కాక బహిరంగ లేఖ రాసినందున, అది ఆయన పట్టించుకునేది లేనిదీ తెలియదు. లేక, కమిటీ వారు ఆ లేఖ ను తనకు నేరుగా కూడా పంపుతారేమో తెలియ దు. అదెట్లా జరిగినా, పైన అనుకున్నట్టు, కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వ నాయకత్వానికి లేఖ రాస్తూనే, పైన పేర్కొన్న విధానపరమైన స్పష్టతలు ఇవ్వటం అవసరం. లేనట్టయితే, తాము రాష్ట్రాల లో, కేంద్రంలో పాలించిన ప్రతిసారీ ఆదివాసీల పీడన, అణచివేత కొనసాగినట్టు, మున్ముందు కూ డా ఆ పనిచేయబోరన్న కనీసపు ఆశాభావమైనా ఆదివాసీలకు, తక్కిన సమాజానికి కలుగబోదు.కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. వారి కోసం కృషిచేసే మైదాన ప్రాంతాల వారు మాత్రం అనేకులున్నారు. ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ ఆదివాసీ గ్రూపులు, ఆదివాసీ నేతలు అంటూ మాట్లాడటం బాగున్నది గాని, ఆ లేఖ సంతకందార్లలో ఆదివాసీలు కనిపించరు. ఇతరత్రా స్వయంగా ఆదివాసీలు కొన్ని చిన్న బృందాలుగా ఏర్పడి ఈ చర్చలలో పాల్గొంటున్నారు. అది ఆహ్వానించదగినది. కానీ, అవి ప్రాచుర్యం లేని చిన్న గ్రూపులు అయినందున ఎవరి దృష్టికి రావటం లేదు. మావోయిస్టు పార్టీ తనదే సర్వాధిపత్యం అనుకుంటుంది గనుక, ఆదివాసీలను అనుచరులుగా మాత్రమే చూస్తుంది గనుక, తమ అనుబంధ పౌరహక్కుల సంస్థలలోనూ వారిని ముందుకు తీసుకురాకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, మైదాన ప్రాంత మేధావులు కూడా ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ తరహాలో వారికి చోటు కల్పించరు. కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. మరొక స్థాయిలో మాట్లాడాలంటే, ఆదివాసీ సమాజాలకు చెందిన ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, ఎంతో కొంత సంపన్నులు అయినవారి సంఖ్య తక్కువేమీ కాదు. నక్సలిజం, దాని అణచివేతలు మొదలై సాగుతున్న ఐదున్నర దశాబ్దాల కాలంలో తమ సమాజాన్ని కాపాడుకునేందుకు వారు చేసినదేమిటనేది వేరే విషాద చరిత్ర. అదే స్థితి 'ఆపరేషన్ కగార్' సందర్భంలోనూ కనిపిస్తున్నది. ఎప్పుడూ వినిపించని ఆదివాసుల గొంతు ఇప్పుడూ వినిపించటం లేదు. ఎవరూ వినిపించనివ్వటం లేదు. అందరికీ వారు ఒక ఇంధనం మాత్రమే. ఇంతకూ మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను కోరుతున్నది ఎందుకోసం? ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నందున ఈ గండం గడిచి గట్టెక్కేందుకా లేక, ఒకవేళ మోదీ ప్రభుత్వం నిజంగానే కాల్పులు విరమించి చర్చలకు ఆహ్వానిస్తే భవిష్యత్తుకు సంబంధించి అజెండా ఏమైనా ఉన్నదా? తమ అజెండా రాజ్యాంగపరమైన పరిపాలన, సంస్కరణల పరిధిలో ఉండి అందుకు ప్రభుత్వం అంగీకరిస్తే ఉద్యమ విరమణగా ముగుస్తుందా? ఆయుధాలను వదలటమవుతుందా? ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయుధాలకు తావులేదన్న వాదన ప్రభుత్వం నుంచి వస్తే ఏం చేస్తారు? అట్లాగాక, తమ అజెండాలో ప్రస్తుత రాజ్యాంగాన్నీ, వ్యవస్తనూ అంగీకరించబోము, కనుక ఆయుధ విరమణ ఉండదు, కాల్పుల విరమణ మాత్రమే అన్నది అజెండా అవుతుందా? ప్రస్తుతం తమ వైపు నుంచి ఆరు నెలలు ప్రకటించింది కాల్పుల విరమణే గాని ఆయుధాలు పక్కనపెట్టడం కాదు, విసర్జించటమూ కాదు. అటువంటి స్థితిలో, ప్రస్తుతం పూర్తి పైచేయిగా ఉన్న ప్రభుత్వం కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరిస్తుందసలు? పోరాట విరమణ జరుగదు, కాల్పుల విరమణ మాత్రమే అంటే అమిత్ షా ఒప్పుకొంటారా? రాజ్యాంగం, చట్టాల అమలు గురించి మాట్లాడటం ఒక పరిధి విషయం. అది ఎవరు ఎంతైనా మాట్లాడవచ్చు. కానీ రాజ్యాంగాన్ని, వ్యవస్థను నిరాకరించటమనే సిద్ధాంతం మౌలికంగా భిన్నమైనది. ఆ విషయమై ఏమి మాట్లాడుతారు? మేము నిరాకరిస్తాము, మీరు మాత్రం కట్టుబడండి అంటూ చేసే సూత్రీకరణలు మేధోపరంగా బాగానే ఉంటాయి. కాని వారే అనే 'బూర్జువా, దోపిడీ వ్యవస్థ' అందుకు అంగీకరిస్తుందనుకోవటం, ఆ ప్రకారం రకరకాల చతురమైన తార్కిక వాదనలు చేయటం పూర్తి అవాస్తవికమైన బలహీనత. ముందు కాల్పులు విరమించండి, రాజ్యాంగ విషయాలు, ఇతర విషయాలు తర్వాత కూర్చుని మాట్లాడుకోవచ్చుననటం తమ అమాయకత్వమైనా కావాలి, హోంమంత్రి అమిత్ షా అమాయకుడని భావించటమైనా కావాలి. పైగా ప్రభుత్వంతో తాము సమాన స్కంధ స్థితిలో ఉన్నామనే అవాస్తవిక, స్వీయ భ్రమాత్మక ధోరణి కూడా మావోయిస్టుల ప్రకటనలలో కనిపిస్తున్నది. అటువంటి టేబుల్ కేంద్రం- నాగాల చర్చల వంటి సందర్భాలలో చూశాం. రాజశేఖరరెడ్డి ప్రభుత్వ కాలంలో చూశాం. ప్రస్తుతం పరిస్థితి మోదీ పాలనలో పలు విధాలుగా మారింది. పార్టీ కూడా అనేక విధాలుగా బలహీనపడింది. కనుక సమాన స్కంధత లేదు. మరొకవైపు ఆదివాసీల సమస్య తీవ్రత మారలేదు.

# సిందూర్ నిలిపివేతపై సందేహాలెన్నో

పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. ఆ ఉగ్రదాడికి కారణమైన, ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పే ఉద్దేశంతో ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజల్లో ఎన్నో ఆశలను రేకెత్తించింది. ఉగ్రవాదులందరినీ మట్టుబెడతారని, తద్వారా పహల్గాంలో అమరులైన అమాయక పర్యాటకుల ఆత్మ శాంతిస్తుందని, ఉగ్ర స్థావరాలకు అడ్డాగా మారిన పాకిస్థాన్ నుంచి ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, తద్వారా భవిష్యత్తులో ఇక అక్కడి నుంచి ఉగ్రవాదుల చొరబాట్లు ఉండవని ప్రజలు భావించారు సింధూ నది నీళ్లను ఆపివేసిన తర్వాత పాక్ కరువు కోరల్లో చిక్కుకొని కాళ్ల బేరానికి వస్తుందనే ప్రచారాలనూ దేశ ప్రజలు విశ్వసించారు. 1971లో బంగ్లా ఏర్పాటు చేసినట్టు బలుచిస్థాన్ ఏర్పాటువరకు మోదీ ప్రభుత్వం వెనుకడుగు వేయదని గాఢంగా నమ్మారు. దేశాన్నేలిన గత ప్రభుత్వాలు, పార్టీల చేతికానితనం వల్లె పాకిస్థాన్ రెచ్చిపోతుందని, నెహ్రూ తప్పిదం వల్లనే కశ్మీర్ సమస్య ఏర్పడిందని, ఇప్పుడు మోదీ పాక్‌కు బుద్ధి చెప్తాడని బీజేపీ ప్రచారం చేసింది. దానితో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి మోదీ కోసమైనా భారత్‌కు మద్దతు పలుకుతారని ప్రజలు నమ్మారు. అందుకే ఆపరేషన్ సిందూర్‌కు దేశ ప్రజలు మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం తమ రాజకీయ విభేదాలు, సైద్ధాంతిక వైరుధ్యాలను పక్కనబెట్టి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. వరల్డ్ బ్యాంక్ (ఐఎంఎఫ్) మన అభ్యంతరాన్ని పెడచెవిన పెట్టి పాక్‌కు అప్పు ఇవ్వడం ద్వారా ముందే సంకేతాలిచ్చింది. ఈ




విషయంలో మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా విఫలమైంది. ఇక ఆపరేషన్ సిందూ ర్ జరిగిన మూడు రోజులు ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, ఫైసలాబాద్, గుజర్న్‌వాలా, పెశావర్, క్వెట్ట, రావల్పిండి, సియాల్కోట్, సర్గోద, బహావల్‌పూర్ వంటి పాక్‌లోని ప్రధాన పట్టణాలు మన సైన్యం చేసిన దాడులతో అతలాకుతలమయ్యా యి. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎయిర్ బేస్ లులంచ్ ప్యాడ్‌లు అన్ని ధ్వంసమయ్యాయి. మన దేశం ఇన్ని విజయాలు సాధించిన తర్వాత అమెరికా ఒత్తిడితో కాల్పుల విరమణకు ఒప్పుకోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏ శాంతి ఒప్పందం లేకుండా, ఉగ్రవాదులను అప్పగించకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకున్నారో దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పాలి. పక్కలో బల్లెం లాంటి పాకిస్థాన్ పీక పిసికే ఒక సువర్ణావకాశాన్ని అమెరికా ఒత్తిడికి తలొగ్గి మాత్రమే వదులుకున్నామా? అనేది దేశ ప్రజల ముం దున్న అతిపెద్ద ప్రశ్న. 1971లో కూడా పాకిస్థాన్‌కు మద్దతుగా దాడి చేస్తామని అమెరికా బెదిరించింది. ఆ బెదరింపులను లెక్కచేయని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయడాన్ని జనం ఇప్పుడు గుర్తు కు తెచ్చుకుంటున్నారు. ఈ కాల్పుల విరమ ణ కూడా మన దేశ ప్రధాని కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించడం యావత్ దేశానికే అవమానకరంగా ఉన్నది. ఆధునిక యుగంలో యుద్ధం ఎలా ఉన్నా దౌత్యనీతి, రాజనీతి ద్వారా మాత్రమే శత్రువును మన కాళ్ల దగ్గరికి తీసుకురాగలమని, ప్రజలను మతపరమైన భావోద్వేగాల కు గురిచేసి ఓట్లు దండుకున్నంత సులువుగా ప్రపంచ దేశాలు మనకు అండగా ఉంచుకోలేమని గుర్తెరగాలి. అంతేకాకుండా అమెరికా లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీత వేస్తాయి కానీ, ఆలింగనాలకు మిత్రులైపోయి మనకు సహకరిస్తాయనుకోవడం అవివేకమే అవుతుంది. చరిత్రలో మనకంటే ముందు దేశా న్నేలిన ప్రధానులు, ప్రభుత్వాలు కూడా అప్పటి కాలమాన, దేశ అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకున్నారు తప్ప బీజేపీ ప్రచారం చేసినట్టు వారికి ధైర్యం లేక కాదు, రాజనీతిజ్ఞత తెలువక కాదు. గత ప్రభుత్వాలను నిందించడం సులువే కానీ, ప్రభుత్వంలో ఉండి సంక్షోభాలు ఏర్పడినప్పుడు దేశాన్ని విజయం వైపు నడిపించడం అంత సులువు కాదన్న విషయాన్ని బీజేపీ నాయకులు, శ్రేణులు ఇకనైనా గమనించాలి. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా జోక్యానికి అవకాశం ఇచ్చి మన దేశ అంతర్గత సమస్య అయిన కశ్మీర్ విషయంలో ఇతర దేశాలకు అవకాశం ఇచ్చినట్టయింది.

# జీఎన్ రామకృష్ణ 15వ వర్ధంతి.




పీలేరు : క్రీ"శే డిఎన్ నాగయ్య(రైల్వే)గుండ్లూరు నారాయణమ్మ దంపతుల పెద్దకుమారుడు జి.ఎన్ రామకృష్ణ పరమపదించి నేటికి 15వ వర్ధంతి సందర్భంగా వారికుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసికొబ్బరికాయకొట్టి పుష్పాలతో నివాళి అర్పించారు. ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని ఏలోకానున్న పుణ్యలోకాలు మంచి జన్మ ప్రాప్తించాలని భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆయన చేసిన సేవలు కుటుంబంతోమధుర జ్ఞాపకాలు స్మరించుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మపత్నిగుండ్లూరు సావిత్రమ్మ, కుమారుడు వెంకటేష్, తమ్ముళ్లు గుండ్లూరు జయశంకర,గోపి, చెల్లెలు కామాక్షి పద్మావతి బావ రామనారాయణ మేనల్లుళ్లు నాగేంద్రబాబు బాలాజీ మేనకోడలు మనిషా కామాక్షి సునీత నాగేంద్రబాబు( వైఫ్) కుమార్తె ఆద్యశ్రీ.

# గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం.



బనగానపల్లె : ఆర్థిక సహాయం బనగానపల్లె టౌన్ గ్రామ రెవెన్యూ సహాయకుడు అయిన మస్తాన్ వలీ అనారోగ్యం వలన ఈ నెల 13న మరణించడం జరిగినది. ఈ యొక్క విషయం తెలుసుకొని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు తలారి సుబ్రహ్మణ్యం గ్రామ రెవెన్యూ సహాయకులు అయిన తలారి గోపాలుడు తలారి చెన్నప్ప తలారి మల్లేశ్వరుడు తలారి సుధాకర్ తలారి మధు ప్రసాద్ తలారి సుబ్బలచ్చమ్మ వచ్చి నివాళి అర్పించడం అయినది. గ్రామ రెవెన్యూ సంఘం తరఫున ఐదువేల రూపాయలు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు తలారి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మస్తాన్ వలి కుటుంబమునకు అందజేయడం జరిగినది.

# పాత కార్మిక చట్టాల రక్షణకై మే 20న సార్వత్రిక సమ్మె ను జయప్రదం జయప్రదం చేద్దాం



కర్నూలు : కార్మికులకు, రైతులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, నూతన అగ్రి మార్కెటింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను, గ్రామీణ బందును జయప్రదం చేయాలని ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర కమిటీ సమావేశం ఈరోజు రేపు అనగా మే 13, 14 తేదీలలో కర్నూలు జిల్లా ఆదోనిలో జరుగుతున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసాద్ మాట్లాడుతూ జాతీయంగా, అంతర్జాతీయంగా మితవాద శక్తులు ఆధిపత్యం వహించి ప్రజాస్వామ్య శక్తులపై దాడులు చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై నమ్మకం లేని బిజెపి పాలకులు రాజ్యాంగం ప్రసాదించిన కార్మిక చట్టాలపై దాడులకు పునుకున్నారని అందులో భాగంగానే 29 కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నారని విమర్శించారు. ఇవి లేబర్ కోడ్లు కావని, కార్పొరేట్ల కోడ్లని ఎద్దేవా చేశారు. కార్పొరేట్లకు కార్మికులను, రైతులను కట్టు బానిసలుగా చేయడానికి లేబర్ కోడ్లు, అగ్రి చట్టం తెస్తున్నారని కావున వాటిని తిప్పి కొట్టాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. దేశ ప్రయోజనాలను విస్మరించిన భారత పాలకులు అమెరికా ట్రంప్ కు తాబేదారులుగా వ్యవహరిస్తూ ఆడమన్నట్టు ఆడుతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రేపటి సమ్మెకు కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయడానికి, కేంద్రానికి వత్తాసు పలుకుతూ, అమరావతి జపంతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రాంతాల పక్షపాత వైఖరిని వ్యతిరేకిస్తూ, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధిని చేపట్టాలని %×ఖీఖ% రాష్ట్ర కమిటీ సమావేశం డిమాండ్ చేస్తూ తీర్మానించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా నాయకులు జి.వెంకప్ప, కె ప్రసాద్ లతోపాటు 13 జిల్లాల చెందిన మరో 20 మంది ఐ.ఎఫ్.టి.యు నాయకులు పాల్గొన్నారు

# నిరుద్యోగులను మోసం చేసిన కూటమి సర్కార్


- మహేంద్ర నాయుడు

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు.




కర్నూలు : రాష్ట్రంలోని నిరుద్యోగులను కూడా కూటమి సర్కార్ నిలువునా మోసం చేసిందని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యములో కళా వెంకట్రావు భవన్ నందు విలేఖరుల సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు మట్లడుతూ డియస్సి పేరుతో 24 వేలు పైగ ఖాళీగా ఉంటే 16 వేలు పోస్టులు భర్తీ చేసి మిగతా పోస్టులకు మ్నొండి చెయ్యి చూపింది అలగే యూనివర్శిటీల్లో ,మెడికల్ కలలెజీల్లో,లైబ్రెరిలో,జూనియర్ ,డిగ్రీ కాలేజీల్లో సంవత్సరలుగ ఖాళీ గ ఉన్నాయి ఆ ఉద్యోగల భర్తీ పై ఎటువంటి ఆలోచన చేయ్యడం లేదన్నారు. 2014-19 లో కూడా తెలుగుదేశం ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. వారి పార్టీలోని రాజకీయ నిరుద్యోగులకు మాత్రమే భృతి కల్పించి, నిరుద్యోగులను మోసం చేశారు. తిరిగి తాజా ఎన్నికల్లో కూటమి పార్టీలను గెలిపిస్తే లక్షల సంఖ్యలో ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామంటూ ఆశలు కల్పించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకు దీనిపై బడ్జెట్లో కనీస కేటాయింపులు కూడా చేయ లేదు? ప్రతిసారీ గత ప్రభుత్వం అప్పులు చేయ్యాడం వల్ల నే ఎవరికి న్యాయం చేయలేకపోతున్నామంటూ చంద్రబాబు పదేపదే అబద్ధాలు చెప్పి అందరిని చెవుల్లో పూలు పెడుతున్నారు. అధికారంలోకి రాకముందు పవన్ కాల్యణ్ ఎగేరెగిరి గంతులేసిన వ్యక్తి నేడు నిరుద్యోగుల కు న్యాయం చేయ్యటంలో మెసం చేశారు. అధికారమే లక్ష్యం జరిగిన లోకేష్ పాద యాత్ర పనికిరాని యాత్ర గ చరిత్రలో మిగిలిపోతుంది. ఎన్నికల నాడు ఇచ్చిన హామీలను అమలు చేయ్యకుండ చంద్రబాబు మెసం వల్లే నేడు ప్రజలు ,నిరుద్యోగులు ఆత్మహత్యలు జరుగుతున్నాయి. భవిష్యత్ లో యూత్ కాంగ్రెస్ అన్ని వర్గాలకు అండగ ఉంటు పోరాటం చేస్తూంది. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా చైర్మెన్ బజారన్న ,ఓబిసి చైర్మెన్ సంబశివుడు.మైనారిటీ చైర్మెన్ ఖాజ ,యూత్ కాంగ్రెస్ నాయకులు వెంకట్,ఆశోక్,రాజు,మహేష్,వంశి,నంద తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడు జ్యుడీషియల్ కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ నిషేధం




సత్యవేడు మే 13, తిరుపతి జిల్లా సత్యవేడు జ్యుడీషియల్ కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్పై నిషేధం విధిస్తున్నట్టు స్థానిక ఎస్సై రామస్వామి చెప్పారు.కోర్టు ముందు భాగంలో ఎవరు కూడా వాహనాల పార్కింగ్కు అనుమతి లేదన్నారు.శ్రీసిటీ కంపెనీ పనులకు వెళ్లే కార్మికులు కోర్టుకు ముందు భాగంలో వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తున్నారన్నారు. దీంతోపాటు ఇతరులను కూడా కొందరు వారి ద్విచక్ర వాహనాలు,నాలుగు చక్రాలకు సంబంధించి కారు వంటివి ఇక్కడ పార్క్ చేయడం వల్ల కోర్టు కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు.ఈ నేపథ్యంలో సిఐ మురళి నాయుడు ఆదేశాల మేరకు ఎస్సై రామస్వామి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది మంగళవారం కోర్టుకు ముందు భాగంలో భారీ గేట్లు ఏర్పాటు చేశారు. ఎవరైనా సరే ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే చట్టపరకారం చర్యలు తీసుకొని కేసు కూడా నమోదు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి చెప్పారు.

# బొలెరో కారు డి ముగ్గురికి స్వల్ప గాయాలు





ఆలూరు : ఆలూరు మండలం హులే బీడు సమీపాన బొలెరో వాహనం కారును ఢీకొంది. కారులో ఉన్న నలుగురిలో ఇద్దరు చిన్నపిల్లలకు స్వల్ప గాయాలు కాగా కారు డ్రైవర్ కు చేయి విరిగింది. మొలగవల్లి గ్రామం నుండి బొలెరో వాహనంలో శనగలు వేసుకొని లోడుతోఆదోనికి వెళు తుండగా ఆదోని నుండి వస్తున్న కర్ణాటక కారు ఒకదానికి ఒకటి ఢీకొని ఎస్ ఆర్ కె ఫ్యాక్టరీ దగ్గర ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టారు.

# మే 20వ తేదీ న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




కర్నూలు : : కార్మికులను నయా బానిసలుగా చేస్తూ పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం మేరకు మే 20వ తేదీ జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక నంద్యాల పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణంలో ఉన్న నిశాంతి భవన్లో కేంద్ర కార్మిక సంఘాల సమైక్య రౌండ్ టేబుల్ సమావేశం పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు ఓబులేసు, ఐఎఫ్టియు నాయకులు చౌడప్పల అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఏ నాగరాజు, సుంకయ్య, రమేష్ బాబు మాట్లాడుతూ కార్మికులు ఎంతో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోళ్లుగా మార్చి కార్మికులను యాజమాన్యాలకు కత్తు బానిసలుగా చేస్తూందని దీనికి వ్యతిరేకంగా మే 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఉద్యోగులు కార్మికులు ప్రజలందరూ జయప్రదం చేయాలని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల్లో నడుస్తున్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి బ్యాంకులో రైల్వేలు ప్రైవేటీకరణ చేయడం వల్ల ఇందులో పని చేసే కార్మికులు ను తొలగించి ప్రయత్నం చేస్తుందని బ్రిటిష్ కాలం నుంచి తెచ్చినటువంటి చట్టాలను తుంగలో తొక్కి కనీస వేతనాలు చట్టం సమ్మె చేసే హక్కులను ముఖ్యమైనటువంటి చట్టాలను తొలగించే ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. 14వ మహాసభ సిఫారస్ 1992 సుప్రీంకోర్టు తీర్పును పరిగణంలోనికి తీసుకొని కనీస వేతనం 26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, భారత కార్మిక మహాసభ సిఫారసులకు అనుగుణంగా స్కీం వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం, సామాజిక భద్రత ఉద్యోగభద్రత అమలు చేయాలని రాష్ట్రంలో దేశంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి చట్ట ప్రకారం పర్మినెంట్ కార్మికులు చేసే పని కాంట్రాక్టు కార్మికులు చేస్తే వారికి పర్మినెంట్ కార్మికులకు వేతనం అలవెన్స్ బెన్ఫిట్ లు ఇవ్వాలని సుప్రీంకోర్టు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన తీర్పును అమలు చేయాలని కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని బీడీ, బిల్డింగ్ కార్మికుల సంక్షేమ పథకాలు మరియు లేబర్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన బిల్డింగ్ కార్మికుల సంక్షేమ నిధిని తిరిగి జమ చేయాలని ముఠా లారీ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈపీఎఫ్ కనీస పెన్షన్ పది వేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్స్ సాధన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఉద్యోగులంతా మే 20వ తేదీ జరగబోయే సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, జిల్లా కార్యదర్శులు వి బాల వెంకట్, వెంకటలింగం, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాయుడు, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు మౌలాలి మాట్లాడుతూ మే 25 జరగబోయే సమ్మెను కార్మికులంతా ఐక్యంగా జయప్రదం చేయాలని ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట.మద్దులు, పట్టణ కార్యదర్శి కే యం డి గౌస్,

# ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న రైతన్నలకు భరోసా ఏది...?

రైతుల మోసకారి చంద్రబాబు -వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి....

కర్నూల్ లో ఖరీఫ్ కు అప్పులు చేసి సిద్ధమవుతున్న రైతన్నలు....

సామాన్య రైతులు పెట్టుబడులకు లేక ఇబ్బందులు పడుతున్న వైనం....







కర్నూల్ : అన్నదాత సుఖీభవ పథకం అంటూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ప్రచారాలు చేస్తూ రైతన్నల ఓట్లను దండుకునేందుకు ప్రచారాలు నిర్వహించి ప్రతి ఒక రైతుని ఆదుకుంటామని ప్రగల్భాలు పలికి హామీలు ఇచ్చి నేటికీ ఒక ఏడాది కావస్తున్న రైతుల ఊసే ఎత్తకపోవడం, అన్నదాత సుఖీభవ పథకం గురించి మాట్లాడకపోవడం ఒక కారణమైతే, గత ఏడాది రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు టిడిపి ప్రభుత్వం పై విరుచుకు పడుతున్నారని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి అన్నారు, ఇలాంటి పథకాలతో రైతుల ఓట్లను దండుకొని మోసం చేసి పథకాలు నిర్వహించకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి అలవాటేనని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నరన్నారు.

**ఇది జగమెరిగిన సత్యం : వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి**

చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటే రైతులు సుఖంగా ఉండాలేరని, కష్టనష్టాలే ఎక్కువగా ఉంటాయని రైతు బాంధవుడిగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు రైతులు జీవితాలు కళకళలాడుతూ ఉండేవని, అలాంటి రాజన్న స్వరాజ్యం వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డికె సాధ్యమని, తండ్రికి తగ్గ తనయుడిగా ఢిల్లీ పీఠాన్ని ఎదిరించి వైయస్సార్ పేరు పై సొంత పార్టీ పెట్టి దిగ్విజయంగా పార్టీని గెలిపించుకొని రైతన్నలకు అండగా నిలిచిన ఘనత వైఎస్ కుటుంబానికె దక్కిందాని వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రైతు భరోసా ద్వారా ప్రతి ఏడాది తూచా తప్పకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, రైతు భరోసా పథకాన్ని బటన్ నొక్కి నేరుగా ఐదు ఏండ్లు రైతుల ఖాతాలలో జమ చేసిన ఘనత వైఎస్ జగన్ కే దక్కిందని, రైతులు పెట్టుబడులకు లేక అల్లాడుతున్న తరుణంలో సామాన్య రైతులు ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే తమ భూమిని దుక్కి దున్ని, విత్తనాలు కొనుగోలు చేసి, సాగు ఎలా చేయాలి, కూలీలకు డబ్బులు ఎలా చెల్లించాలో అని దిగులు చెందుతున్న తరుణంలో రైతుల చింతనలను పాదయాత్రలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కల్లారా చూసి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరుణంలోనే ఖరీఫ్ సీజన్కు ముందస్తుగా వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి, ఈ పథకం ద్వారా రైతులు పెట్టుబడులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందని అనంతరం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, ప్రకృతి విపత్తుల కాలంలో జగన్మోహన్ రెడ్డి రైతులను ఆదుకొని ఇన్పుట్ సబ్సిడీ అందించిన ఘనత మరియు ప్రత్యేక విపత్తు, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్లు సురేందర్ రెడ్డి తెలిపారు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలో వచ్చి ఏడాది

# సిబిఎస్ఈ ఫలితాల్లో శ్రీసిటీ విద్యా సంస్థల విజయకేతనం

శ్రీసిటీ, : మంగళవారం వెలువడిన సిబిఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయా, అకార్డ్ విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్మయా విద్యాలయ నుంచి పది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన 57 మంది విద్యార్థులలో 16 మంది డిస్టింక్షన్, 29 మంది ఫస్ట్ క్లాస్, 12 మంది సెకండ్ క్లాస్ పొందారు. వీరిలో ఎస్.కవినాయ (93%), కె.జోష్నవి (88.8%), ప్రశాంత్ రాజ్ (87.2%) మార్కులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. పన్నెండవ తరగతి పరీక్షలలో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఆరుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో కె.లోకేష్, ఎ.లోకేష్ రెడ్డి, ఎస్.చరణ్ వరుసగా 93%, 83.4%, 82.4% మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 9వ సారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. అలాగే పన్నెండు తరగతి పరీక్షలలో ఇది రెండవ బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ఫలితాలు పాఠశాలకు దక్కిందన్నారు. అకార్డ్ స్కూల్ కు సంబందించి వరుసగా రెండవ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన 29 మందిలో 11 మంది డిస్టింక్షన్, 9 మంది ఫస్ట్ క్లాస్, 6 మంది సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్ క్లాస్ పొందారు. ఆర్.ఏ.ఆమేక 92.6%, కళాత్మిక తులసి 92.4%, తాతా లోహిత 89% మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ బృందా ప్రకటించారు. మంచి ఫలితాలు సాదించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో అభినందనలు తెలిపారు.

# భారత్ జవాన్ మురళి నాయక్ కు ఘన నివాళి.





ఆత్మకూరు : భారత దేశానికి పాకిస్థాన్ కు జరిగిన యుద్ధములో వీర మరణం పొందిన అగ్నివీర్ జవాను మురళి నాయక్ చిత్ర పటానికి పూల మాల వేసి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఓనమాల పుల్లయ్య అధ్యక్షతన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఎం ఎస్ పి అండ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి భాషాపోగుల.దరగయ్య మాదిగ. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి, జిల్లా ప్రచార కార్యదర్శి ,కాటేపోగు.నాగయ్య, పాల్గొని దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన వీర జవాన్ మురళి నాయక్ గారి %×% కుటుంబానికి దేవుడు అండగా ఉండి వారిని ఆదరించాలని తెలిపారు మురళి నాయక్ యొక్క మరణాన్ని దేశం ఎన్నడూ మరిచి పోదని వారు ఈ కార్యక్రమములో తెలిపారు ఈ కార్యక్రమములో జిల్లా నాయకులు శేషం దేవసహాయం, నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి బి. చిన్నవెంకటరమణ, టౌన్ అధ్యక్షులు చిలుక నాని మండల నాయకులు కొత్తరామాపురం రంగస్వామి,పెద్ద అనంతపురం రంగస్వామి, చిన్నపుల్లయ్య, బాలరాజు యూత్ లీడర్ వెంకటేష్ పులుగుజ్జు .ప్రకాశం మాదిగలు, పాల్గొన్నారు.



# చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో మరో ముద్దాయి అరెస్టు.



ఆలూరు : ఆలూరు నియోజవర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చిప్పగిరి లక్ష్మీ నారాయణ హత్య కేసులో మరో ముద్దాయిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ గత 15 రోజులు కిందట ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో 15వ. ముద్దాయి గా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ముద్దాయి గౌసియా కు రెండు లక్షలు ఆర్థిక సాయం చేసినట్లు పోలీస్ విచారణలో తేలినట్లు ఆయన చెప్పారు. మొగ్గాయిని కోర్టులో హాజరు పరిచే రిమాండ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో పతికొండ డివిజన్ డిఎస్పి వెంకట్రామయ్య, ఆలూరు సిఐ శివశంకర్ రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

# నల్ల కాలువ గ్రామంలో బాయ్స్ కబడ్డీ పోటీలు.



ఆత్మకూరు : నల్లకాలువ గ్రామంలో గుడ్ షఫర్డ్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతిష్ట మహోత్సవము సందర్భంగా. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామంలో ఉమ్మడి



జిల్లా స్థాయిలోబాయ్స్ కబడ్డీ టోర్నమెంట్ పోటీలు ప్రారంభించుట. ఈ కార్యక్రమమునకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతిని భాష పోగు దరగయ్య. మరియు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిభాష పోగు చిన్న వెంకటరమణ వారిఆధ్వర్యంలోటాస్ వేసి ఉమ్మడి జిల్లా స్థాయిబాయ్స్ కబడ్డీ టోర్నమెంట్ పోటీ లను ప్రారంభించారు. ఈ కార్యక్రమమునకు నల్ల కాలువ పాత్రికేయులు మిద్దె బాలరాజు. దేశ పోరాటం విలేఖరి కాటిపోగు నాగన్న.మాణిక్యం. చిన్న సుబ్బయ్య. సంఘ పెద్దలు:-స్వాములు. నాగరాజు. సుబ్బయ్య. యూత్ (యువకులు) తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.


# అనుకున్నది సాధించాం, అప్రమత్తంగా ఉందాం

భారత్ పాకిస్థాన్ తాజా యుద్ధస్థితి ఉభయ దేశాల భావి సంబంధాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి యావద్భారతీయులను అమితంగా కలచివేసింది. ఆ హతులు అందరూ ఆసేతు హిమాచలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులను భగ్నం చేసి, ఆ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక రంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే కుతంత్రంతో జరిగిన ఉగ్రవాద దాడిపై సమస్త భారతీయుల ఆగ్రహావేశాలు, భావోద్వేగాలలో కేంద్ర ప్రభుత్వమూ పాలుపంచుకున్నది. 2016లో ఉరి, 2019లో పుల్వామా ఉగ్రవాద ఘాతుకాలు సంభవించినప్పుడు భారత్ శక్తిమంతమైన, ప్రభావదాయకమైన ప్రతిచర్యలు చేపట్టింది. భవిష్యత్తులోనూ ఎలాంటి ఉగ్రదాడులకైనా అటువంటి ప్రతిస్పందనలు ఖాయమని ఆ ప్రతి దాడులతో భారత్ స్పష్టం చేసింది. పహల్గాం పాశవికకాండకు మరింత కఠినమైన గుణపాఠాన్ని నేర్పాలని భారత్ దృఢంగా సంకల్పించుకున్నది. ఆ సంకల్పసాధనలో భాగంగా తొలుత భారత్‌లోని పాకిస్థానీ జాతీయుల వీసాలను రద్దు చేసిందిబీ దశాబ్దాలుగా అమల్లో ఉన్న, పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన సింధునదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయాలతోనే పహల్గాంపై తన ప్రతీకార చర్య ఎంత కఠినంగా ఉండేది భారత్ తేటతెల్లం చేసింది. మే 7 ప్రాతఃకాలంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రదేశాల (పాకిస్థాన్‌లో నాలుగు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఐదు)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత వాయుసేన క్షిపణి దాడులు నిర్వహించింది. పహల్గాం ఊచకోత అనంతరం పాకిస్థాన్ సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మన సైనిక దళాలు ఎంచుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడంలో సంపూర్ణంగా సఫలమయ్యాయి. పాకిస్తాన్ పంజాబ్ రాష్ట్రంలోని బహ్వల్‌పూర్ (జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయమున్న నెలవు), మురిద్కే (లష్కరే తయిబా ప్రధాన స్థావరమున్న ప్రదేశం) పట్టణాలపై జరిగిన ఆ మెరుపుదాడులు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో వెల్లడించాయి. పాకిస్థాన్ ఆధారిత, ప్రేరేపిత ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా సరే వారిని శాశ్వతంగా మట్టుబెట్టి తీరాలన్న భారత్ దృఢసంకల్పాన్ని అవి విశాల ప్రపంచానికి, మరీ ముఖ్యంగా ఇస్లామాబాద్ పాలకులకు ఎటువంటి మినహాయింపులు లేకుండా చాటిచెప్పాయి. తన భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది.

## రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, స్పీకర్, విద్యాశాఖ మంత్రి జిల్లా పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

ప్రోటోకాల్ ఏర్పాట్లు జాగ్రత్తగా ఉండాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, : రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, శాసనసభ స్పీకర్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి, తదితరులు అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, తదితరుల జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల జిల్లా అధికారులు, జేఎన్టీయూ విసి, ఇతర మండల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గవర్నర్ 17వ తేదీన ఉదయం రైలు ద్వారా అనంతపురం చేరుకుంటారని, అనంతరం జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం గంటలకు రైలు ద్వారా బయలుదేరి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఓవరాల్ ఇన్చార్జిగా జాయింట్ కలెక్టర్ ఉంటారన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అధికారుల టీం, వాహనాలు, లైజెన్ అధికారులు ఉండాలని, వాహనాల కాన్వాయ్ లో అంబులెన్స్ ఉండాలని, భోజన ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. జేఎన్టీయూలో డయాస్ ప్రణాళిక ప్రకారం జరగాలని, 16వ తేదీన డ్రస్ రిహార్సల్స్ చేయాలని, అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లైయిజన్ (ఏఎస్ఎల్) కార్యక్రమం నిర్వహించాలన్నారు. సెక్యూరిటీ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈనెల 15, 16, 17 వ తేదీలలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. 15వ తేదీన మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా గుత్తి పట్టణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు మంత్రి చేరుకుంటారని, అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని అదేరోజు రాత్రికి గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో బస చేస్తారన్నారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు గుత్తి మండలం బేతపల్లి గ్రామం వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, అదే రోజు అనంతపురంలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, అన్ని చోట్ల పూర్తిస్థాయి ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అధికారుల మధ్య సమన్వయం, సమాచారం ఉండాలన్నారు. అలాగే 16వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు జిల్లా పర్యటనకు రానున్నారని, ఈ కార్యక్రమాలకు సంబంధించి ప్రోటోకాల్ అరేంజ్మెంట్లు పటిష్టంగా చేయాలన్నారు. ఒక్కొక్కరికి ఒక టీం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర గవర్నర్, విద్యాశాఖ మంత్రికి సంబంధించిన వాహనాలు ఏర్పాటు, విఐపి సెక్యూరిటీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. గుత్తిలో జరిగే కార్యక్రమానికి సంబంధించి గుంతకల్ ఆర్డీవో ఇన్చార్జిగా ఉంటారని, ఎమ్మెల్యే కూతురు వివాహానికి సంబంధించి అనంతపురం ఆర్డీవో ఇన్చార్జిగా ఉంటారని, జేఎన్టీయూ కార్యక్రమానికి సంబంధించి హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డిసి మల్లికార్జునుడు ఇన్చార్జిగా ఉంటారని, ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్ దగ్గర ఏర్పాట్లకు సంబంధించి హెచ్.ఎల్.సి ఎస్డిసి రామ్మోహన్ ఇన్చార్జిగా ఉంటారన్నారు. విఐపిల జిల్లా పర్యటనకు సంబంధించి అన్ని విధాల సిద్ధం కావాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డిఓ కేశవ నాయుడు, టౌన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్, నెడ్క్యాప్ డీఎం, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సొంతూరులో పరిశ్రమలు పెట్టండి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజ

ఎంఎస్ఎంఈ పార్కులతో ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్త

ఇదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్న మంత్రి సవిత

అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు

జగన్ హయాంలో పారిశ్రామికంగా కుంటుపడిన ఏపీ : మంత్రి సవిత



పెనుకొండ : ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి.. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. మన యువతకు ఉద్యోగిలిచ్చి... రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించండి' అని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీని పారిశ్రామిక హబ్ గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

### తొలి దశలో 20 ఎకరాల్లో...

రొద్దం ఎంఎస్ఎంఈ పార్కులో తొలి దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్లు చొప్పున భూ కేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

### సొంతూర్లో పరిశ్రమలు పెట్టండి...

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు రేయింబవళు కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఒకవైపు రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తూనే, మరో వైపు సాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులను తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా రూపురేఖలే మారిపోయాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువత ఎక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు, సొంతూర్లోనే కంపెనీలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు వల్ల వచ్చే ఆదాయం అక్కడి ప్రభుత్వాలకు, ప్రజలకు ఉపయోగపడతుందన్నారు. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ఆదాయం...స్థానిక ప్రజలకు, ప్రభుత్వానికి లభ్యమవుతుందన్నారు.

### చంద్రబాబు రాకతో పారిశ్రామిక రంగానికి ఊతం

గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని, ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి బయటకు పంపించేశారని అన్నారు. జే ట్యాక్స్ చెల్లించాలంటూ పారిశ్రామిక వేత్తలను వేధించారని, ఫలితంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. దీనివల్ల ఉద్యోగాల్లేక యువత రోడ్డున పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు మరోసారి అధికారంలోకి రావడంతో, పారిశ్రామిక రంగానికి ఊతమొచ్చిందని తెలిపారు. ఎందరో బడా పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

మన ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాలు, ఆవరణలు ప్రతి ఒక్కటి స్వచ్ఛంగా పెట్టుకోవాలి

ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి చూపించాలి

-జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ వేగంగా పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,




అనంతపురం, : జిల్లాలో దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడం జరుగుతోందని, ఈ విషయమై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జి.ఎస్.డబ్ల్యు.ఎస్, ఉపాధి హామీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, తదితర అంశాలపై డీపీఓ, డ్వామా పిడి, జడ్పి సిఈఓ, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్ లు, డివిల్డివోలు, డివిల్పిఓలు, ఈఓఆర్డీలు, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నామని, విలువైన పనులను ఈ కార్యక్రమాల కింద చేపట్టాలన్నారు. ప్రజల్లో మార్పు తీసుకురావాలని, స్వచ్ఛత అనేది మనం అనుకున్నట్లు జరగాలని, మన ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాలు, ఆవరణలు ప్రతి ఒక్కటి స్వచ్ఛంగా పెట్టుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన బీట్ ద హీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఈ విషయమై డిపిఓ మానిటర్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ, ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణ సరిగా చేయడం లేదని రకరకాల ఫిర్యాదులు వస్తున్నాయని, ఇందుకు సంబంధించి పట్టణ ప్రాంతాలలో వార్డు శానిటేషన్ సెక్రటరీ, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రటరీలు బాధ్యత వహించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, ఇందుకు సరిపడా మనుషులు ఉండాలని, హౌస్ హోల్డ్ కి సరిపడా మనుషులు ఉన్నారా లేదా అనేది చూసుకోవాలని, సచివాలయం వారిగా చెత్త సేకరణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని, చెత్తను తరలించేందుకు సరిపడా వాహనాలు కూడా ఉండాలని, గార్బేజ్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ని నిషేధించడం జరిగిందని, దానిని దశలవారీగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని, దుకాణాల వద్ద తడి, పొడి చెత్త డస్ట్ బిన్ లను పెట్టాలని, పెట్టని వారికి నోటీసులు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి జరిమానాలు వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన సేఫ్టీ మెజర్స్, మెటీరియల్ ఇవ్వాలని సూచించారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మనమిత్ర క్యాంపెయిన్ లక్ష్యం పూర్తి చేయాలని, సిటిజన్ ఈకేవైసీ, పీపుల్ వర్కింగ్ ఫ్రమ్ హోమ్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, డెత్ మార్క్ సిటిజన్స్, మిస్సింగ్ సిటిజన్స్ ఇన్ హౌస్ హోల్డ్, ఏపీ సేవ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్స్, తదితర అంశాలకు సంబంధించి పెండింగ్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి వేసవి మంచి పనులు జరిగే కాలమని, ఉపాధి పనులను విరివిగా చేపట్టాలన్నారు. వ్యక్తిగత సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్ లకి సంబంధించి పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేసి పెండింగ్ ని త్వరితగతిన చేపట్టాలన్నారు. ఖాళీలు లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే నియమించాలన్నారు. వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్స్ లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలలో వార్డులకనుగుణంగా అన్ని చోట్ల చలివేంద్రాలను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వాట్సప్ మనమిత్ర, ప్రజల చేతిలో ప్రభుత్వం క్యూఆర్ కోడ్ స్టాండీస్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిపిఓ నాగరాజు నాయుడు, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డ్వామా పిడి సలీమ్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, పిజిఆర్ఎస్ తహసిల్దార్ వాణిశ్రీ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి...

జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్

పరిశ్రమల స్థాపన తోనే జిల్లా అభివృద్ధి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి...



పుట్టపర్తి, : రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి మండలం కప్పల బండ సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సూక్ష్మ చిన్న మధ్యతర పారిశ్రామిక వాడ ను జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత పారిశ్రామిక వాడలో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తదితరులు మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు, అలాగే మౌలిక సదుపాయ కల్పనకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లో కూడా పారిశ్రామిక వాడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నేడు పుట్టపర్తి మండలం కప్పల బండ లో మౌలిక సదుపాయాల కల్పన కొరకు రూ. 11.71 కోట్లు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ద్వారా సూక్ష్మ మరియు చిన్న సమస్యల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల స్థాపనకు ప్లాట్స్ అభివృద్ధి చేయడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రైతులు సహకారం అందిస్తే ఇంకా బాగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉందని అంతేగాక పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. 20 28 నాటికి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎం ఎస్ ఎం ఏ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంట్లో కనీసం ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అన్నారు. మొదటి దశలో 2000 కోట్ల పెట్టుబడి తో ఎం ఎస్ ఎం ఈ పార్కుల్లో మరియు 20 27 28 నాటికి, 16000 ఎం ఎస్ ఎం ఈ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 11 ప్రారంభోత్సవాలు జరిగాయని అలాగే 39 దాకా శంకుస్థాపనలు అయినట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి కల్పించే విధంగా శ్రీ సత్య సాయి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం కప్పల బండలో 192 ప్లాట్లు కాగా వీటిలో 34 ప్లాట్లు 14 యూనిట్లకు కేటాయించడం జరిగిందని, ఒక యూనిట్ పనిచేస్తుందని అలాగే నాలుగు అమలులో ఉన్నాయని మరియు తొమ్మిది యూనిట్లో ఇంకా అమలు కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. కొత్త దశ ఇప్పుడు ప్రారంభించబడితోందని ఇందులో 52.94 ఎకరాల విస్తీర్ణంలో 32 ప్లాట్లతో అభివృద్ధి చేయబడిందని తెలిపారు

### అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె శ్రీమతి సింధూర రెడ్డి మాట్లాడుతూ

ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రానికే పుట్టపర్తి పారిశ్రామికవాడ రోల్ మోడల్ గా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ పారిశ్రామికవాడలో 104 ఎకరాలలో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆదాయ రంగం పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఉన్న పారిశ్రామిక వేత్తలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, 2014 నుంచి 2018 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కప్పల బండ వద్ద 104 ఎకరాలు సేకరించి పారిశ్రామిక వార్డును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో దూర దృష్టితో పారిశ్రామిక సంఘాన్ని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. ప్రతి ఒక్కరు ఉత్పత్తిని రంగాన్ని ఏర్పాటు చేసుకొని ఆదాయ మార్గం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, పరిశ్రమలు వస్తె మన ప్రాంతం అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ పారిశ్రామిక వేత్తలు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సువర్ణ ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ ఏపీఐఐసీ, డీఐసి అధికారులు ఎంపీపీ రమణారెడ్డి, టిడిపి కన్వీనర్ రామాంజనేయులు ,సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ , మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి , పాల్గొన్నారు.

# ముస్లింల అస్తిత్వానికి ఎక్కడ ప్రమాదం ఉన్నా..
# అక్కడ పరిటాల శ్రీరామ్ ఉంటాడు

ధర్మవరం సంఘటన నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు

ఒక గొడవ విషయాన్ని కొందరు తమ స్వార్థానికి వాడుకోవాలని చూశారు

ధర్మవరంలో మైనార్టీల జోలికి వస్తే ఊరుకునేది లేదు

పరిటాల శ్రీరామ్ అర్ధరాత్రి నాకు ఫోన్ చేసి అండగా నిలిచారు.. బాధితుడు దాదా ఖలందర్



ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ముస్లింల అస్తిత్వానికి ప్రమాదం వచ్చినా.. అక్కడ నేను ఉంటానని పరిటాల శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం సమీపంలోని ఒక దాబాలో సోమవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి ఆయన స్పందించారు. కొందరు వ్యక్తులు దాదాఖలందర్ పై దురుసుగా వ్యవహరించారు. ఈ సంఘటన మీద రాత్రి వేళ ముస్లింలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ వెంటనే స్థానిక సీఐ,, డీఎస్పీలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ ఘటనలో ఎవరున్నా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అయితే ఈ విషయాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ స్పందించారు. ఈ విషయంలో పోలీసులను పూర్తి స్వేచ్ఛగా చర్యలు తీసుకోవాలని తాను కోరినట్లు వివరించారు. దీంతో పోలీసులు కూడా వెంటనే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే తాను ఇంత వేగంగా స్పందిస్తానని కొందరు వ్యక్తులు ఊహించి ఉండరని.. ఈ గొడవను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. తాను ఇంత వేగంగా స్పందిస్తానని వారు కూడా ఊహించి ఉండరని ఈ విషయంలో వారికి బాధ కూడా అయి ఉండొచ్చని శ్రీరామ్ వ్యాఖ్యానించారు. ఇవే కాకుండా ధర్మవరంలో ముస్లింలకు ఏ కష్టం వచ్చినా పరిటాల శ్రీరామ్ ముందుంటాడని స్పష్టం చేశారు. తమ కుటుంబానికి ముస్లింలతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని.. తాను ఆంజనేయ స్వామిని ఎలా ఆరాధిస్తానో అల్లాను కూడా అలాగే ఆరాధిస్తానని శ్రీరామ్ స్పష్టం చేశారు....

### శ్రీరామ్ అర్ధరాత్రి వేళ ఫోన్ చేసి నాకు అండగా నిలిచారు... దాదా ఖలందర్

సోమవారం రాత్రి మామిళ్ళపల్లి వద్ద ఉన్న డాబాలో తన పట్ల కొందరు వ్యక్తులు అనుచితంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మా స్నేహితులు నాకు అండగా నిలిచారు. అదే సమయంలో పరిటాల శ్రీరామ్ కూడా అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఫోన్ చేసి నాకు అండగా నిలిచారు. ఈ ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పరిటాల శ్రీరామ్ తనకు ఆ విధంగా అండగా నిలిచినందుకు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు...

# భక్తులకు కనువిందు చేసిన శేషవాహనుడు.



రాయదుర్గం : రాయదుర్గం పట్టణములో శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవములలో భాగముగా మంగళవారం శేష వాహనోత్సవము నిర్వహించబడినది. కోటలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం నుండి వినాయక సర్కిల్ వరకు శేష వాహనంలో అర్చకులు శ్రీ స్వామివారిని ఊరేగించారు. ఈ ఉత్సవ కార్యక్రమము నందు అధిక సంఖ్యలో పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు, బలిజ, మార్వాడి,బెస్త, కమ్మ,సనాతన హిందూ ధర్మము,సూర్యసేవా సమితి సంఘముల వారు పాల్గొనడం జరిగినది. వినాయక సర్కిల్ నందు భక్తి పరవశంతో కోలాటం చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు మహిళా భక్తుల నిర్వహించారు ఈనెల 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా అభిషేకాలు ప్రత్యేక అలంకరణ తో, అత్యంత భక్తిశ్రద్ధలతో, అర్చకుల వేద మంత్రాలతో జరుగు లాగున ఇఒ నరసింహారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈనెల 15వ తేదీన శ్రీ స్వామివారి కల్యాణోత్సవం 17వ తేదీ బ్రహ్మ రథోత్సవం జరుగునని ఆయన తెలిపారు.



### లంచం తీసుకుంటూ ఏసీబీకి
# పట్టుబడ్డ సూర్యాపేట డిఎస్పి సిఐ...




సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం పై ఏసీబీ దాడులు జరిగాయి. డీఎస్పీ పార్థసారథి, సీఐ రాఘవులు పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో రైడ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఓ స్కానింగ్ ను సీజ్ చేసిన వైద్యాధికారులు. సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు కాకుండా భారీ మొత్తంలో 25 లక్షలు రూపాయల డబ్బులు డిమాండ్ చేశారని డీఎస్పీ,,సీఐ లపై ఆరోపణలు ఎదుర్కొన్నారు. లంచం డిమాండ్ కు సంబంధించిన ఆదారాలు ఏసీబీ అధికారులకు సమర్పించిన స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు. పూర్తి ఆదారాలు రుజువు కావడంతో డీఎస్పీ పార్థసారథి,సీఐ రాఘవులు పై కేసు నమోదు చేసి అదుపులో తీసుకున్నారు. రేపు డీఎస్పీ, సీఐ లను ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తారని ఏసీబీ అధికారులు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వాధికారులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

### విక్రమ్ రావు మృతి జర్నలిజానికి
# తీరని లోటు - టిడబ్ల్యూజేఎఫ్ ...




కామారెడ్డి : ఐఎఫ్ డబ్ల్యుజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్ రావు మృతి జర్నలిజానికి తీరని లోటు అని టీడబ్ల్యూజెఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జాతీయ అధ్యక్షులు విక్రమ రావు సోమవారం హఠాత్ మరణం చెందారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు జిల్లా కేంద్రంలోని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ విక్రమ్ రావు 40 సంవత్సరాలు పైగా జర్నలిజం వృత్తిలో కొనసాగి ఎన్నో అవార్డులు పొందారని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడిగా ఆరుసార్లు విధులు నిర్వహించి జర్నలిజంలో జర్నలిస్టుల సమస్యలపై జాతీయస్థాయిలో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. విక్రమ్ రావు లాంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని, జర్నలిజానికి తీరని లోటు అని అన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి మాట్లాడుతూ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షుడు కోటంరాజు విక్రమ్ రావు హఠాన్మరణం విషాదకర సంఘటనతో జర్నలిస్టు సమాజం తీరని లోటును ఎదుర్కొందని అన్నారు. విక్రమ్ రావు 82 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. తెలుగు వారైన విక్రమ్ రావు జర్నలిజం రంగంలో దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు పొందారని తెలిపారు. ఢిల్లీ, లక్నో వంటి నగరాల్లో పలు ప్రఖ్యాత పత్రికల్లో జర్నలిస్టుగా, ఎడిటర్‌గా సేవలందించారు. సుదీర్ఘకాలంగా లక్నోలో నివసిస్తున్నారని చెప్పారు. జర్నలిస్టుల హక్కుల కోసం నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన పోరాడారని తెలిపారు. 1984 నుండి ఐఎఫ్‌డబ్ల్యూజే కు ఆరు సార్లు అధ్యక్షుడిగా ఎన్నికై, వృత్తి ధర్మం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన దాదాపు 200కు పైగా పుస్తకాలు రచించారు అని గర్వంగా చెప్పారు. దేశంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలకు మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కామారెడ్డి జిల్లా తరపున ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని కామారెడ్డి జిల్లా యూనిట్ ప్రకటించింది. విక్రమ్ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కరుణాకర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణమాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు జమాల్పూర్ లక్ష్మణ్, రాకేష్, పిట్ల రాజు, చిన్న హరీష్, తదితరులు పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో వైసీపీకి షాక్ ఇచ్చిన సొంత పార్టీ ఎంపీటీసీలు

పరిటాల సునీత, శ్రీరామ్ సమక్షంలో

టిడిపిలో చేరిన ముగ్గురు ఎంపీటీసీలు

గతంలో ఎంపీటీసీలను

బలవంతంగా క్యాంపులకు తరలించిన ప్రకాష్ రెడ్డి

తాజాగా ఎంపీపీ ఎన్నికలకు నోటిఫికేషన్

రాగా ముందే టిడిపిలో చేరిన ఎంపిటిసిలు

వైసిపి తీరుతో విసిగిపోయాం.. టిడిపితోనే అభివృద్ధి

సాధ్యమని పార్టీలో చేరామన్న ఎంపీటీసీలు



అనంతపురం : రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలోని వైసీపీ ఎంపీటీసీలు అపార్టీకి షాక్ ఇచ్చారు. గతంలో సభ్యులు గైర్హాజరుతో వాయిదా పడ్డ ఎంపీపీ ఎన్నికకు మరోసారి నోటిఫికేషన్ వెలువడనుంది. ఈనెల 15న నోటిఫికేషన్, 19న ఎన్నిక జరిగే అవకాశం ఉంది. అయితే ఈలోపే వైసిపికి ఆ పార్టీ ఎంపీటీసీలు గట్టి స్ట్రోక్ ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో ముగ్గురు ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వెంకటాపురంలో వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పేరూరు-1 ఎంపీటీసీ కరియన్న, పేరూరు-2 ఎంపీటీసీ భారతీ, మాదాపురం ఎంపీటీసీ సంపత్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రస్తుతం రామగిరి మండలంలో మొత్తం పది ఎంపిటిసి స్థానాలు ఉండగా... ఒకరు చనిపోయారు. మిగిలిన 9 మందిలో ఒకరు తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఎంపీటీసీ ఉండగా... తాజాగా మరో ముగ్గురు ఎంపీటీసీలు ఆ పార్టీలో చేరడంతో ఎంపీపీ ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. మరో ఎంపీటీసీ తెలుగుదేశం పార్టీలో చేరితే కచ్చితంగా ఎంపీపీని టిడిపి కైవసం చేసుకునే అవకాశం ఉంది. అయితే వైసిపి తీరుతో మొదటి నుంచి విసిగిపోయిన ఆ పార్టీ ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ప్రకాష్ రెడ్డి ఎంపీపీ ఎన్నిక సమయంలో వారిని క్యాంపులకు తరలించి నిర్బంధించారు. ఇదే విషయాన్ని తాజాగా పార్టీలో చేరిన ఎంపీటీసీలు కూడా స్పష్టం చేశారు. తాము వైసిపి తీరుతో విసిగిపోయామని. రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి పరిటాల సునీతతోనే సాధ్యమనే నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు చెప్పారు. రెండు నెలల క్రితం జరిగిన ఎంపీపీ ఎన్నిక విషయంలో ప్రకాష్ రెడ్డి ఎంపీటీసీలందరిని క్యాంపులకు తరలించి ఎన్నిక జరగకుండా చేశారు. పైగా పరిటాల సునీత వారిని బలవంతంగా తీసుకెళ్లారని ప్రచారం చేశారు. అయితే ఇప్పుడు ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ ముందే ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు తెలుగుదేశం పార్టీలో చేరడంతో వైసిపికి గట్టి దెబ్బ తగిలింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం తమతో కలిసి పని చేసేందుకు ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు

# టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

టిడిపి అధికారంలో ఉంటేనే కార్యకర్తలకు తగిన గౌరవం .

కార్యకర్తలే టీడీపీకి వెన్నుముక

క్షేత్రస్థాయి నుంచి పార్టీని కలసి కట్టుగా బలోపేతం చేద్దాం

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



నల్లమాడ్ : తెలుగుదేశం పార్టీ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. నల్లమాడ మండల కేంద్రంలోని షాదీ ఖానా లో టీడీపీ కార్యకర్తల తో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె మాట్లాడారు. పార్టీ అధికారంలోనే ఉంటేనే కార్యకర్తలకు తగిన గౌరవం లభిస్తుంది అన్నారు అధికారం లేకపోతే 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వంలో ఎదురైన ఎన్నో కష్టాలు అవమానాలు అవాంతరాల సంఘటనలను మాజీ మంత్రి గుర్తు చేశారు . కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని కొనియాడారు. కార్యకర్తల కష్టార్జితంతోనే కూటమి ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు శాయ శక్తుల పని చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పోలవరం నిర్మాణం తో పాటు అమరావతిలో రాజధాని నిర్మాణం హైకోర్టు నిర్మాణ అభివృద్ధి పనులు ,ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని తెలిపారు . పుట్టపర్తి నియోజకవర్గం లో 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని 2029 లోపల అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చి పుట్టపర్తి నియోజకవర్గాన్ని మరో కోస్తాంధ్రలా సస్య శ్యామలం చేస్తామని పేర్కొన్నారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. అనంతరం నల్లమాడ మండలంలో గ్రామ కమిటీ, సాధికార సారథి, బూత్ లెవల్ కమిటీ, గ్రామ కమిటీ అధ్యక్షులు ,కన్వీనర్లు, కో కన్వీనర్లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శంకర్ ,టీడీపీ సీనియర్ నాయకులు ప్రేమానందరెడ్డి, దొన్నికోట కేశవరెడ్డి , మాజీ ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి , ఎల్ఐసి నరసింహులు ,టీడీపీ సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి ,సలాం ఖాన్, రషీద్ ఖాన్ ,అబ్బాస్ ఖాన్, గడ్డం రమణారెడ్డి, దొన్నికోట రమణ,డాక్టర్ బుట్టి నాగభూషణం, రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మన్న, గన్ రెడ్డి, శివారెడ్డి ,సర్పంచ్ లు భారతి బాయ్ చామ్లా నాయక్, ప్రభాకర్ రెడ్డి, మంజునాథ రెడ్డి , మల్లి,టీడీపీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఈ పది నెలల్లో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేశాం

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు

బలహీన వర్గాలు నివసించే చోట అభివృద్ధి చేస్తున్నాం

వైసీపీ హయాంలో అనవసర పనులు...

హెచ్చుమీరిన అవినీతి

రివర్ ఫ్రంట్ తో నగరానికి కొత్త శోభ

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

కూటమి పాలనలో నగరమంతటా అభివృద్ధి

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

10, 9 డివిజన్లలోని పార్కుల అభివృద్ధికి

రూ.కోటి 95 లక్షలతో శ్రీకారం



రాజమహేంద్రవరం : తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 10 నెలల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు రూ. 100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని డబుల్ ఇంజన్ సర్కారులో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), ఎమ్మెల్సీ సోము వీర్రాజు చెప్పారు. ఫేజ్%-%1లో భాగంగా 10వ డివిజన్‌లో ఐదు పార్కులు, 9వ డివిజన్‌లో రెండు అభివృద్ధికి స్థానిక మోడల్ కాలనీలోని పార్కు వద్ద సుమారు రూ. కోటి 95 లక్షలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమండ్రి సిటీలో అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రోడ్లు కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. నగరంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని ఒక అవగాహన, ప్రజల ఆలోచనలకు తగ్గట్టు చేస్తున్నామన్నారు. అభివృద్ధి ఒకే చోట కాకుండా నగరమంతటా జరిగే చూస్తున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జెఎన్ రోడ్డు వంటి ప్రధాన మార్గాల్లోనే అవసరం లేక పోయినా డివైడర్లు, ఫుట్ పాత్ లు నిర్మించారని బడుగులు నివసించే ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో తాము మార్పు చేసి చూపించారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. గతానికి, ఇప్పటికీ జరిగిన తేడా ప్రజలు గమనించాలని కోరారు. రాజమండ్రి నగర ప్రజల 15 ఏళ్ళ కల సాకారం చేసేందుకు గోదావరి గట్టున రివర్ ఫ్రంట్ పనులకు అకురార్పణ జరిగిందన్నారు. రాజమండ్రిని టూరిజం హబ్ గా తీర్చిదిద్దే క్రమంలో రివర్ ఫ్రంట్ పనులకు శ్రీకారం చుట్టామని, రూ. 8 కోట్లతో అప్పర్ ప్రామినేట్ ముందుగా చేస్తున్నామని, లోయర్ ప్రామినేట్ పనులను రూ. 14 కోట్లతో చేస్తారని దీంతో మొత్తం రూ. 22 కోట్లతో రివర్ ఫ్రంట్ పూర్తవుతుందని ఆయన చెప్పారు. గోదావరి గట్టుకు, అక్కడ ఉన్న ప్రముఖుల విగ్రహాలకు మరింత శోభ చేకూర్చే విధంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజమండ్రిలో మరింతగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, యువ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రజలకు ఎక్కడ ఏ అవసరం ఉంటే ఆ పని చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలు గుర్తించడంతో పాటు మరలా సమస్య తలెత్తకుండా ఒక పద్ధతి ప్రకారం అభివృద్ధి పనులు చేసుకు వెళుతున్నారని, రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మజ్జి రాంబాబు, వాసిరెడ్డి బాబి, వై శ్రీను, పి నాగేంద్ర, యెనుముల రంగబాబు, జామి సత్యనారాయణ, చొప్పెర్ల భద్రరావు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రాంతంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలి

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచే డోర్ టు డోర్ తడి,

పొడి చెత్త సేకరణ పనులు జరగాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

అనంతపురం నగరంలోని నిర్మలానంద నగర్ లో పారిశుద్ధ్య

పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



అనంతపురం, : పట్టణ ప్రాంతంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడం జరుగుతుందని, ఇందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని నిర్మలానంద నగర్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిషేధం అమలు చేయనున్న నేపథ్యంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను ప్రజలెవరు ఉపయోగించరాదన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. అలాగే కమర్షియల్ ఏరియా నందు ప్రతిరోజు చెత్తను తొలగించే విధంగా చూడాలని, నగరంలోని శానిటేషన్ సెక్రటరీలు సెట్స్ ( వాకి టాకీ) ఉపయోగించాలని, ప్రతి 350 ఇండ్లకు చెత్తను సేకరించుటకు ఒకమైక్రో పాకెట్ అటెండర్, 2 వర్కర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ పారిశుద్ధ తనిఖీల్లో భాగంగా ప్లాస్టిక్ చెత్త తొలగించుటకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, వార్డులో ఎంతమంది శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నరు, గృహాల నందు చెత్తను సేకరించుటకు ఏ సమయం నుండి ఏ సమయం లోపల గృహాలలో చెత్తను సేకరించుటకు సానిటేషన్ వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు, దుకాణదారులు ప్లాస్టిక్ మరియు చెత్తను దుకాణం ఎదుట రోడ్డుపై వేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, తదితర విషయాలను వార్డు సెక్రటరీ, ఎమ్హెచ్ఓ, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతపురం నగరంలోని దుకాణదారులకు తడి చెత్త, పొడి చెత్తకు వేరువేరుగా ఉండేటట్లు దుకాణం వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని, అలాగే షాపుకు వచ్చు వినియోగదారులు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అలా కాకుండా షాపు ఎదురుగా చెత్తను వేసినచో దుకాణదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ విధంగా షాపు యజమానులకు తెలియజేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఆ విధంగా ఏర్పాటు చేసుకోవాలని అక్కడే ఉన్న దుకాణదారునికి తెలియజేశారు. ఇది మొదటిసారి కావడంతో మీకు తెలియజేయడం జరుగుతున్నదని, ఇలాగే రాబోయే రోజుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అక్కడ ఉన్న దుకాణదారునికి తెలియజేశారు. అలాగే దుకాణదారులు దుకాణానికి పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ ఇతరత్రా చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని దుకాణదారునికి తెలియజేశారు. సచివాలయం వారీగా ఎన్ని గృహాలు ఉన్నాయి, అందులో ఎంతమంది శానిటేషన్ వర్కర్స్ ఉన్నారు, నివేదికలు వెంటనే తయారుచేసి ఇవ్వాలని, శానిటేషన్ వర్కర్లు తక్కువ ఉన్నచోట కొత్తవారిని నియమించేందుకు మున్సిపల్ సమావేశం నందు నిర్ణయం తీసుకొని నివేదికలు సమర్పించాలని దానిపై సిడిఎంఏ గారితో మాట్లాడి త్వరితగతిన ఏర్పాటు చేసినందుకు కృషి చేస్తామన్నారు. అలాగే నిర్మలానంద నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రేఖ అనే మహిళ ఇంటికి చెత్తను సేకరించేందుకు శానిటేషన్ వర్కర్లు ప్రతిరోజు వస్తున్నారా, ఏ టైంకి వస్తారని అడిగారు.దానికి సమాధానంగా ప్రతిరోజు వస్తారని, ఎనిమిది నుండి తొమ్మిది గంటల మధ్యలో రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కి ఆమె తెలియజేశారు. అలాగే మీరందరూ తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఉంచాలని వారికి తెలిపారు.అలాగే ఒక ట్రాక్టర్ ఒక రోజుకు దాదాపు 1,200 ఇండ్ల వరకు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని కమిషనర్ జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శానిటేషన్ పనులు చేస్తున్న వర్కర్ కు చేతికి గాయం కావడం గమనించి వారికి మందులు వేసుకోవాలని సూచించి అలాగే శానిటేషన్ పనులు చేస్తున్న వారికి గ్లౌజస్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు తెలిపారు.ఈకార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, ఎస్సీ కార్పొరేషన్ చంద్రశేఖర్, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ బిఎల్ నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షకీల్, శానిటేషన్ సెక్రటరీ తోసిఫ్ శర్మస్, తదితరులు పాల్గొన్నారు.



# దండకారణ్యంలో కార్పొరేట్ యుద్ధం

'మావోయిస్టులపై అంతిమ యుద్ధం' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టింది. అడవంతా పోలీసు క్యాంపులతో నింపేసింది. వేలాది పారామిలటరీ బలగాలు, గ్రేహౌండ్స్ దళాలతో దండకారణ్యాన్ని కొన్ని రోజులుగా జల్లెడ పడుతున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆయుధాలతో అడవి అణువణువునూ శోధిస్తున్నది. ఆదివాసీ గూడేలను తగలబెడుతున్నది. నిర్దాక్షిణ్యంగా ఎన్‌కౌంటర్ పేరిట పచ్చని అడవిలో నెత్తురుటేర్లను పారిస్తున్నది. మావోయిస్టులను.. అమాయక ఆదివాసీ తెగలను ఊచకోత కోస్తున్నది. మారణహోమాన్ని సృష్టిస్తున్నది. మానవహక్కుల హననానికి పాల్పడుతున్నది. హింసతో, అణచివేతతో అడవిలో కల్లోలం రేపుతున్న తేడాది జనవరిలో ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 500 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారంటే ఎంతటి భీతావహ పరిస్థితి నెలకొన్నదో అర్థం చేసుకోవచ్చు. మానవ హక్కుల ఉల్లంఘన ఏ తీరుగా సాగుతున్నదో ఒక అంచనాకు రావచ్చు. మరోవైపు దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ఆదివాసులపై జరుగుతున్న దాడిని నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ పౌరసమాజం నుంచి అంతే స్థాయిలో డిమాండ్ పెల్లుబుకుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ సభలో లక్షలాది జనం సాక్షిగా వేదికపై నుంచి పిలుపునివ్వడంతో రాజకీయవర్గాల్లోనూ ఒక కదలిక ప్రారంభమైంది. కానీ, కేంద్రం మాత్రం మావోయిస్టు నిర్మూలనే కాదు, అడవిలో మానవ మాత్రుడు ఉండకూడదనే ధ్యేయంతోనే ముందుకు సాగుతున్నట్టుగా స్పష్టంగా తెలిసిపోతున్నది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతున్నది. మరింతకీ ఈ మావోయిస్టులు ఎవరు? ఎక్కడినుంచి వచ్చారు? అడవుల్లో ఎందుకు మగ్గుతున్నారు? ఆయుధాలు ఎందుకు చేపట్టారు? ఆదివాసులతో వారికి అనుబంధమెక్కడది? వారికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకున్న వైరమేమిటి? స్వజాతి జనులపై ఎందుకోసం.. ఎవరికోసం ఈ హింస? ఎవరి వికాసానికీ రక్తపాతం? ఆపరేషన్ కగార్ ఆంతర్యమేంటి? ఎవరికి లాభం? మరెవరికి నష్టం? అనే మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాటికి జవాబులు కూడా సుస్పష్టం. మావోయిస్టులు దిగంతాల నుంచి ఊడిపడలేదు. శత్రుదేశాల నుంచి వచ్చిన చొరబాటుదారులు కాదు. ఈ భారతావని బిడ్డలే. మన సోదరీ సోదరులే. ప్రభుత్వాలకు, వాళ్లకు, మనకు మధ్య ఉన్నది కేవలం సిద్ధాంత వైరుధ్యమే. అది శాంతిభద్రతల సమస్య కాదు. ఒక రాజకీయ ఉద్యమం. దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షే దానికి కారణం. సూటిగా చెప్పాలంటే భారత రాజ్యాంగంలోని ఆదేశిక స్రూతాల అమలు కోసం ఒక వర్గం తరాలుగా సాగిస్తున్న సాయుధ పోరాటం. బిర్సా ముండా, కుమ్రంభీమ్‌ల ఆశయాల ప్రతిరూపమే నూతన ప్రజాస్వామిక విప్లవం. మరెందుకు మావోయిస్టులపై ఈ ప్రభుత్వాల యుద్ధం అంటారా? దండకారణ్యం గర్భంలో దాగిన లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద కోసం. దశాబ్దాల కిందటనే మైనింగ్ మొదలైనా అదింకా దండకారణ్యమంతటికీ విస్తరించలేదు. అందుకు ప్రధాన కారణం దండకారణ్యాన్ని పొదివి పట్టుకున్న ఆదివాసీలు. ఆ అడవిబిడ్డలకు ఆలంబనగా నిలుస్తున్న మావోయిస్టులు. అందుకే ఖనిజ సంపద దోపిడీకి ఏ అడ్డు లేకుండా చేసుకునేందుకు కార్పొరేట్‌శక్తులు, వాటి అడుగులకు మడుగులొత్తుతున్న కేంద్ర ప్రభుత్వ పాలకులు ఆ ఆదివాసీలు, మావోయిస్టుల ఏరివేతకు కుట్రపూరిత ప్రణాళికలకు సైతం దశాబ్దాల కిందటే తెరలేపాయి. ప్రపంచంలోనే అపారమైన, అత్యంత అరుదైన ఖనిజ నిల్వలకు చిరునామా మన భారతదేశం. అందులోనూ ప్రధానంగా దండకారణ్య ప్రాంతం. మన దేశంలో అటవీ విస్తీర్ణం 2.29 మిలియన్ చ.కి.మీ. ఆ మొత్తం విస్తీర్ణంలో మధ్య భారతంలోని దండకారణ్యం 9.60 శాతం. ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, పశ్చిమబెంగాల్ తదితర అతిపెద్ద రాష్ట్రాల్లో లక్షలాది చదరపు కిలోమీటర్ల పరిధిలో దండకారణ్యం విస్తరించి ఉన్నది. తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలు, ఏపీలో తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఆ పరిధిలోకి వస్తాయి. ఈ అటవీక్షేత్రం లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాల నిలయం. ఈ దేశ జాతి సంపద. దాని విలువ దశాబ్దకాలం కిందటనే రూ.9 వేల లక్షల కోట్లని ఒక ప్రాథమిక అంచనా. ఇప్పుడది అంతకు రెట్టింపు. ఆ ఖనిజ సంపదపై దశాబ్దాల కిందటనే సామ్రాజ్యవాదుల కన్ను పడింది. 1968లో జపాన్‌కు చెందిన బైలదిల్లా కంపెనీ మైనింగ్ ప్రారంభించి ఇనుప రజను కొల్లగొట్టడం మొదలుపెట్టింది. ఆ తర్వాత టాటా పోస్కో, ఎస్సార్ జిందాల్, రియో టింటో, బీహెచ్‌ఐ, మిట్టల్, వేదాంత రీసోర్సెస్ వంటి విదేశీ కార్పొరేట్ సంస్థలు జతకలిశాయి. ఇప్పుడు ఆ ఖనిజ సంపద దోపిడీకి అదానీ, అంబానీ తదితర దేశీయ కార్పొరేట్ శక్తులు క్యూ కట్టాయి. ఆయా కంపెనీలకు జాతి సంపదను గంపగుత్తగా దోచిపెట్టేందుకు ఢిల్లీ పెద్దలు ఒప్పందాలు చేసుకున్నారు, చేసుకుంటూనే ఉన్నారు. రాబోయే మూడు దశాబ్దాల్లోగా అక్కడి ఖనిజసంపద యావత్‌ను కొల్లగొట్టే లక్ష్యంతో బడా పారిశామికవేత్తలు, వారి కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రం ముందుకు సాగుతున్నట్టు స్పష్టంగా తెలిసిపోతున్నది. అదిప్పుడు మరింత విశ్వరూపం దాల్చింది. కాంగ్రెస్ హయాంలో 90వ దశకంలో జన జాగరణ్ పేరిట మొదలైన ఊచకోత ఆ తర్వాత 2005లో సల్వాజుడుంగా రూపాంతరం చెందింది. ఆపై గ్రీన్‌హంట్‌గా, ఆపరేషన్ సమాధాన్ పేరిట ముందుకువచ్చింది. ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం ఏకంగా అంతిమయుద్ధం ప్రకటించింది. యుద్ధరీతులు మారాయేమో కానీ దమననీతి మాత్రం మారలేదు. రూపమేదైనా వాటి లక్ష్యం ఒక్కటే. మైనింగ్ విస్తరింత. అందుకే అడవి పొత్తిళ్ల నుంచి ఆదివాసీల తరిమివేత. మావోయిస్టుల ఏరివేత. అదిప్పుడు విశ్వరూపం దాల్చింది. కార్పొరేట్ శక్తుల కోసం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, శాంతిచర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ఇప్పటికే ప్రకటించారు. ఆ శాంతి కోసం దేశ మేధావివర్గం కూడా గళం విప్పుతున్నది. తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనతో రాజకీయవర్గాల్లోనూ కదలిక వచ్చింది. అయినప్పటికీ కేంద్రం మాత్రం శాంతిచర్చల ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలోనే దండకారణ్యంలో శాంతి కోసం ఇప్పుడు పౌర సమాజం కూడా డిమాండ్ చేయాలి. ఎందుకంటే ఆదివాసీల విస్థాపన తర్వాత.. మావోయిస్టులను ఏరివేశాక జరగబోయేది ప్రకృతి వినాశనమే. దండకారణ్యాన్ని ఛిద్రం చేయడమే. పోయేది అడవే కదా? అడవిబిడ్డలే కదా? అని అనుకుంటే అంతకంటే పొరపాటు మరొకటి ఉండదు. భారతదేశంలో ఎక్కడా లేని జీవ వైవిధ్యానికి ఆలవాలం దండకారణ్యం. అనేక నదుల జన్మస్థానం. విస్తారమైన వర్షపాతానికి మూలధారం. భూగర్భజలాల పెంపులోనూ ఈ పర్వతశ్రేణులే కీలకం. లక్షల ఏండ్ల పర్యావరణ సమతుల్యతకు కేంద్రం. మరి ఖనిజ వనరుల కోసం అడవిని నరికేసి, పర్వతాలను పిప్పిచేశాక మిగిలేదంతా క్షామం. అంతేనా మైనింగ్ వ్యర్థాలతో నీరు, గాలి కాలుష్యం. వెరసి అడవంచు గ్రామాల్లో మానవ మనుగడే ఒక ప్రశ్నార్థకం. ఇదేమీ ఊహాజనితం కాదు. అమెజాన్ అడవిని నాశనం చేసుకొని నేడు తీవ్ర కరువు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న బ్రెజిల్ దేశం ఓ సజీవ సాక్ష్యం. కరువు కాటకాలతో అల్లాడుతున్న ఆఫ్రికా ఖండంలో ఒక్కొక్క దేశం చరిత్ర చెప్తున్న సత్యం. మన దేశ నడిబొడ్డులో ఆ వినాశనం ఇప్పటికే మొదలైంది. అది క్రమంగా విశ్వరూపం దాల్చుతున్నది. అందుకే ఇప్పుడు శాంతికోసమే కాదు, భవిష్యత్తు తరాల భద్రత కోసమూ గళం విప్పాలి. కదం కదపాలి. అడవిని, ఆ అడవిని వెన్నంటి కాపాడుతున్న అడవి బిడ్డల పోరాటానికి బాసటగా నిలవాలి. అది అత్యావశ్యం. మరీ ముఖ్యంగా తెలంగాణ కర్తవ్యం. ఎందుకంటే రాష్ట్ర వరదాయినిగా నిలిచే గోదావరి జలాలకు ప్రాణాధారం. ప్రాణహిత జన్మస్థానం ఆ దండకారణ్యమే.

# మరో పోరాటానికి నాంది



ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణ సమాజం నాటి పాలకుల అలసత్వంతో అణచివేతకు గురైంది. కరువు- కాటకాలతో భూములు బీళ్లు వారడం, అతివృష్టి-అనావృష్టి, ఆకలి, అప్పులు, దారిద్ర్యం వెంటాడింది. మరోవైపు పంటకు కనీస గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందల మీటర్ల లోతు వరకు బోర్లు వేసినా, బావులు తవ్వినా నీటి చుక్క దొరకని దుస్థితి. తెలంగాణ ఎడారిని మరిపించింది. ఆంధ్రా వలసవాద పాలనలో మన బతుకులేమిటో, మన గమనం ఏమిటో తెలియని అయోమయ పరిస్థితి. ఈ నేపథ్యంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను చూసి ఆవేదన చెంది ఒక వేగుచుక్కలాగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వచ్చారు. తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అణచివేతలను వివిధ కోణాల్లో అధ్యయనం చేసి ఉద్యమ వ్యూహాలను రూపొందించుకోవడంలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. చివరకు తన పదవులకు రాజీనామా చేసి 2001 ఏప్రిల్ 27న జలదృశ్యం వేదికగా టీఆర్ఎస్‌ను స్థాపించి, ప్రజలను ఉద్యమ పథంలో నడిపారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎంత నిబద్ధతతో పని చేశారో.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికతో అంతే నిబద్ధతతో కృషి చేశారు. ఒకనాడు ఆంధ్రా పాలకులు వ్యవసాయం దండగ అన్న చోటే వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మిషన్ భగీరథ, 24 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్తు, ఐటీ, పారిశ్రామికరంగాల్లో వృద్ధి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కల్పన, కులవృత్తులకు చేయూత, ఆసరా పింఛన్లు అందజేశారు. దశాబ్దం పాటు కొనసాగిన కేసీఆర్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగాయి. వినూత్న పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకొచ్చారు. కానీ, గత దశాబ్ద కాలంగా జరిగిన అభివృద్ధి 16 నెలల కాంగ్రెస్ పాలనలో తిరోగమనం చెందడం బాధాకరం. శాంతియుతంగా సుదీర్ఘ కాలం పోరాటం చేసి, తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన స్వరాష్ట్రాన్ని సాధించి, దశాబ్దం పాటు అధికారంలో ఉండి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు జరుపుకొంటున్న వేళ దగాపడిన తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈ రజతోత్సవ సభ మరో పోరాటానికి నాంది పలుకనున్నది.

# పచ్చని పల్లెల్లో రాజకీయాల చిచ్చు



పల్లెటూరు అంటేనే ప్రకృతి సోయగాలు, అందమైన జీవితం, ఆనందాయక జీవనం, పరస్పర సహకారం, స్నేహబంధాలకు నిలయం. గడిచిన తరాల పల్లె ప్రజలు భేదాభిప్రాయాల కంటే బంధాలు, బంధుత్వాలకు ఎక్కువ విలువిచ్చేవారు. కానీ, రాను రాను కొన్ని పల్లెల్లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది. కొందరు నేతలు తమ స్వార్థం కోసం పల్లె ప్రజలను కులాలుగా, వర్గాలుగా విడగొడుతున్నారు. వారిలో వారికే చిచ్చుపెట్టి పగలు, ప్రతీకారాలతో కొట్టుకుచచ్చేలా చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారు. పల్లె గడ్డపై రాజకీయ చిచ్చు నెమ్మదిగా వ్యాపించి, ఐక్యతను చీల్చే విషంలా మారి కల్మషమెరుగని మనుషుల మధ్య విద్వేషాన్ని పెంచుతున్నది. ప్రతి ఎన్నికతో పాటే పల్లెల్లో విభేదాలు, పగలు, ప్రతీకారాలు పెరుగుతున్నాయి. వర్గాలుగా విడిపోయిన ప్రజలు చిన్నచిన్న విషయాలపైనా గొడవ పడుతున్నారు. చివరికి ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడని పరిస్థితికి వచ్చారు. ఒకే ఊరిలో రెండు వర్గాలు, రెండు ధ్వజాలు. ఒకే ఉత్సవానికి వేర్వేరు వేదికలు ఉండటం.. మిత్రులుగా ఉన్నవారు శత్రువులుగా, శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారడం చూస్తున్నాం. కొన్నిసార్లు బంధువులను కూడా బద్ధ శత్రువులుగా మారుస్తున్నాయి పల్లె రాజకీయాలు. చాలా చోట్ల గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి చర్చల కోసం కాకుండా పరస్పర ఆరోపణలకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగే సమావేశాల్లో అభివృద్ధి ప్రణాళికల గురించి కంటే పార్టీల గొడవలు, కార్యకర్తల కొట్లాటలు, ఎవరు ఏ పార్టీకి చెందినవారనే విషయాలే ప్రధానాంశాలు అవుతున్నాయి. పల్లెలో పార్టీకో పెద్ద రాజకీయ నాయకుడు, అతని కింద చిన్న నాయకులు.. వారి పంతమే నెగ్గాలనే ఆలోచనలు.. వెరసి గ్రామాభివృద్ధి కుంటుపడి రాజకీయ కక్షలు పెరుగుతున్నాయి. ఈ వర్గ విభేదాల కారణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ, ముఖ్యంగా అర్హులైన వారికి చేరడం లేదు. నిత్యావసర సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కొందరికే పరిమితమవుతున్నాయి. పథకాలు అర్హులైన, అవసరమైన వారి దరి చేరకుండా ఈ వర్గ రాజకీయాలు అడ్డుకుంటున్నాయి. చాలామంది వృద్ధులు, మహిళలు, పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఒకప్పుడు గ్రామాభివృద్ధి కోసం కలలు కన్న యువత రాజకీయ అసహనంతో అట్టుడుకుతున్నారు. వారి హృదయాల్లో నూతన ఆశలు మొలకెత్తాల్సిన సమయంలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. ఊరంతా కలిసికట్టుగా ఎదగాలనే కలలు.. 'మా వర్గమే గెలవాలనే కుటిల కాంక్షలో కనుమరుగైపోతున్నాయి. ఒక పార్టీ గెలిచి మరో పార్టీ ఓడినప్పుడు గ్రామం గెలవదు. గ్రామం గెలవడం అంటే ప్రతి ఇంట్లో వెలుగు నిండటం.. ప్రతి కుటుంబంలో సంపద పెరగడం.. గ్రామంలో పిల్లలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందడం.. వృద్ధులకు గౌరవం లభించడం.. ప్రభుత్వ పథకాలు బలహీనవర్గాలకు అందడం. ఒక్కమాటలో చెప్పాలంటే గెలుపంటే సామూహిక అభివృద్ధి. రాజకీయాలు చేయడం, పార్టీలకు మద్దతుగా నిలవడం తప్పు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారానే తన భవిష్యత్తును నిర్ణయించే నాయకున్ని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉంది. కానీ, అది గ్రామస్థాయిలో వ్యక్తిగత పగ, ప్రతీకారాలకు సాధనంగా మారడం మాత్రం సరైనది కాదు. అందుకే పల్లె ప్రజలు విచక్షణతో మెలగాలి. పెద్ద పెద్ద నాయకులంతా బాగానే ఉంటారు. కానీ, గ్రామాల్లో సామాన్య కార్యకర్తలు మాత్రం కక్షలతో జీవిస్తుంటారు. ఇలా పగప్రతీకారాలు పెంచుకుంటూపోతే మనుషులు మాత్రమే కాదు, పల్లె కూడా నాశనమవుతుంది. వర్గ, కుల బలహీనతల్ని వదిలి, గ్రామాన్ని బతికించుకోవాలి. అభివృద్ధి పథంలో నడిపించుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, గ్రామ సమష్టి శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. తాత్కాలికమైన వాటి కోసం బంధాలను, స్నేహాలను దూరం చేసుకోవడం సరికాదు. రాజకీయం ఎప్పుడూ అభివృద్ధి కోసం ఉండాలి. అంతేతప్ప వినాశనానికి కాదు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఈ రాజకీయ కక్షలను పక్కనపెట్టి.. పల్లెలో సౌభ్రాతృత్వాన్ని, సహకారాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన పల్లెను మళ్లీ పచ్చగా, సస్యశ్యామలంగా మార్చాలి. అభివృద్ధి మార్గంలో అందరూ కలిసికట్టుగా సాగడమే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.

# డీలిమిటేషన్‌పై గొంతెత్తాలి



సంఖ్యాబలంతో లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు-2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జేడీయూ, టీడీపీ వంటి మిత్రపక్షాల సహకారం బీజేపీకి తోడైంది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితే వక్ఫ్ బిల్లు విషయంలో దూకుడుగా వెళ్లిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశమున్నది. ఎన్డీఏ, ఇండియా కూటములతో సంబంధం లేకుండా దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా పోరాడకపోతే.. దక్షిణాది రాష్ట్రాలకు, ఇక్కడి ప్రజలకు తీరని నష్టం జరిగే ప్రమాదముంది. జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే లోక్‌సభ స్థానాల సంఖ్య భారీగా పెరుగుతుంది. అదే జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు భారీగా లబ్ధి పొందుతాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువ లేకుండాపోతుంది. 1951-52లో దేశ జనాభా 36 కోట్లు కాగా, అప్పుడు లోక్‌సభ సీట్లు 489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశ జనాభా 54 కోట్లు. అప్పుడు సీట్ల సంఖ్యను 545కు పెంచారు. 1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో లోక్‌సభ సీట్ల సంఖ్యకు మరో 25 ఏండ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా.. అప్పటి ప్రధాని వాజపేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు. లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలను పునర్విభజించాలని భావిస్తున్నది. జనగణనను పూర్తి చేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా? అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 120కి చేరుకునే అవకాశం ఉంది. రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్ సహా ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగే ఆస్కారం ఉంది. 1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 ఉన్నప్పుడు, అందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్ల సంఖ్య 522కి కాగా, దక్షిణాది వాటా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్ల సంఖ్య 545కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే, ప్రస్తుతం డీలిమిటేషన్‌తో తెలంగాణలో లోక్‌సభ సీట్ల సంఖ్య 17 నుంచి 20కి మాత్రమే పెరుగుతాయి. ఏపీలో 25 నుంచి 28కి, తమిళనాడులో 39 నుంచి 41కి సీట్లు పెరిగే ఆస్కారం ఉంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటే పార్టీ సులభంగా కేంద్రంలో అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుంది. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదముంది. ఇప్పటికే జాతీయ భాష అంటూ హిందీని రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. నిధుల విషయంలోనూ మొదటి నుంచీ అన్యాయం జరుగుతున్నది. ఈ తరుణంలో పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గితే దక్షిణాదిని కేంద్రం అస్సలు పట్టించుకోదు. డీలిమిటేషన్ వల్ల మనకు జరిగే అన్యాయంపై దక్షిణాదికి చెందిన మెజారిటీ రాజకీయ పార్టీలు ఏకమై జేఏసీగా ఏర్పడి పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే తమిళనాడులో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, పినరయి విజయన్, భగవంత్ మాన్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందులో పాల్గొన్నారు. పలు తీర్మానాలను ఆమోదించి కేంద్రం ముందుంచారు. డీలిమిటేషన్‌ను మరో 25 ఏండ్లు వాయిదా వేయాలన్నది ఇందులో ముఖ్యమైనది.

# పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి.

## జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్

## పరిశ్రమల స్థాపన తోనే జిల్లా అభివృద్ధి

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి...






పుట్టపర్తి, : రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి మండలం కప్పల బండ సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సూక్ష్మ చిన్న మధ్యతర పారిశ్రామిక వాడ ను జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత పారిశ్రామిక వాడలో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తదితరులు మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు, అలాగే మౌలిక సదుపాయ కల్పనకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లో కూడా పారిశ్రామిక వాడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నేడు పుట్టపర్తి మండలం కప్పల బండ లో మౌలిక సదుపాయాల కల్పన కొరకు రూ. 11.71 కోట్లు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ద్వారా సూక్ష్మ మరియు చిన్న సమస్యల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల స్థాపనకు ప్లాట్స్ అభివృద్ధి చేయడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రైతులు సహకారం అందిస్తే ఇంకా బాగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉందని అంతేగాక పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. 20 28 నాటికి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎం ఎస్ ఎం ఏ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంట్లో కనీసం ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అన్నారు. మొదటి దశలో 2000 కోట్ల పెట్టుబడి తో ఎం ఎస్ ఎం ఈ పార్కులో మరియు 20 27 28 నాటికి, 16000 ఎం ఎస్ ఎం ఈ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 11 ప్రారంభోత్సవాలు జరిగాయని అలాగే 39 దాకా శంకుస్థాపనలు అయినట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి కల్పించే విధంగా శ్రీ సత్య సాయి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం కప్పల బండలో 192 ప్లాట్లు కాగా వీటిలో 34 ప్లాట్లు 14 యూనిట్లకు కేటాయించడం జరిగిందని, ఒక యూనిట్ పనిచేస్తుందని అలాగే నాలుగు అమలులో ఉన్నాయని మరియు తొమ్మిది యూనిట్లో ఇంకా అమలు కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. కొత్త దశ ఇప్పుడు ప్రారంభించబడితోందని ఇందులో 52.94 ఎకరాల విస్తీర్ణంలో 32 ప్లాట్లతో అభివృద్ధి చేయబడిందని తెలిపారు.

## అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె శ్రీమతి సింధూర రెడ్డి మాట్లాడుతూ



ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారు కావాలని పిలుపునిచ్చారు.పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్రానికే పుట్టపర్తి పారిశ్రామికవాడ రోల్ మోడల్ గా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ పారిశ్రామికవాడలో 104 ఎకరాలలో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆదాయ రంగం పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఉన్న పారిశ్రామిక వేత్తలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, 2014 నుంచి 2018 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కప్పల బండ వద్ద 104 ఎకరాలు సేకరించి పారిశ్రామిక వార్డును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో దూర దృష్టితో పారిశ్రామిక సంఘాన్ని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు.ప్రతి ఒక్కరు ఉత్పత్తిని రంగాన్ని ఏర్పాటు చేసుకొని ఆదాయ మార్గం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, పరిశ్రమలు వస్తే మన ప్రాంతం అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ పారిశ్రామిక వేత్తలు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సువర్ణ ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ ఏపీఐఐసీ, డీఐసి అధికారులు ఎంపీపీ రమణారెడ్డి, టిడిపి కన్వీనర్ రామాంజనేయులు ,సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ , మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి , పాల్గొన్నారు.


# 20 ఏళ్ల 'భద్ర'.. ఈ హిట్ సినిమాను మిస్ చేసుకున్న ఇద్దరు స్టార్ హీరోలు



రవితేజ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది 'భద్ర'. ఈ సినిమా కథను ఇద్దరు హీరోలు వదులుకున్నారు. వాళ్లెవరంటే..రవితేజ హీరోగా బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'భద్ర'. నేటికి ఈ సినిమా విడుదలై 20ఏళ్లు పూర్తయింది రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా కథను అల్లు అర్జున్ , ఎన్టీఆర్ ఇద్దరూ మిస్ చేసుకోవడంతో రవితేజ అకౌంట్‌లోకి వెళ్లింది."భద్ర' సినిమా కథను బోయపాటి మొదట నాకు చెప్పారు. నాకు ఆ కాన్సెప్ట్ చాలా నచ్చింది. కానీ, డేట్స్ కుదరకపోవడంతో దాన్ని వదులుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఆర్య సినిమా సెట్స్‌పై ఉంది. అది పూర్తి చేయడానికి చాలా సమయం పడుతుందని బోయపాటికి చెప్పాను. ఈ కథను దిల్‌రాజుకు చెప్పడంతో ఆయన ఈ సినిమాను నిర్మించారు. దిల్‌రాజుకు కథ చెప్పాను కాబట్టే ఆ సినిమాలో థ్యాంక్స్ కార్డు కూడా నాపేరు మీద పడింది" అని అల్లు అర్జున్ చెప్పారు. అప్పటినుంచి బోయపాటి – బన్నీ కాంబినేషన్‌లో ఎన్నో కథలు మధ్యలోనే ఆగిపోయాయి. చివరకు వీరిద్దరి కాంబోలో 'సరైనోడు' వచ్చింది.అలాగే ఈ సినిమా కథ చేయడానికి ఎన్టీఆర్‌కు కూడా కుదరకపోవడం గమనార్హం. ఈ విషయాన్నే ఆయనే స్వయంగా చెప్పారు. "భద్ర' సినిమా కథను బోయపాటి నాకు వినిపించినప్పుడు నిజంగా భయపడ్డాను. ఆయన కథ చెప్పే విధానం కూడా నన్ను భయపెట్టింది. ఆరోజు ఆయన వివరించిన తీరుకో లేదంటే కథకు నేను కనెక్ట్ కాలేకనో భద్రను వదులుకున్నాను. కానీ.. ఆ సినిమా చేయలేకపోయినందుకు ఇప్పటికీ బాధపడుతుంటాను. ఈ విషయం చెప్పడానికి నేనేం మొహమాటం పడడం లేదు" అని ఎన్టీఆర్ ఓ సందర్భంలో చెప్పారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'దమ్ము' సినిమా వచ్చి హిట్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే.రవితేజ సరసన మీరా జాస్మిన్ నటించిన 'భద్ర' యూత్‌ను ఆకట్టుకుంది. ఆపదలో ఉన్న అమ్మాయిని రక్షించే యువకుడి కథగా ఇది రూపొందింది. ఈ సినిమాలోని పాటలు ఇప్పటికీ సోషల్ మీడియాలో వినిపిస్తూనే ఉన్నాయి. తెలుగులో సూపర్ హిట్ కావడంతో హిందీ, తమిళ్‌లోనూ రీమేక్ చేశారు.


# సిందూరం ఎక్కడ అని ప్రపంచం అడుగుతోంది

## పహల్గాం ఉగ్రదాడిపై అమితాబ్ బచ్చన్ భావోద్వేగ పోస్ట్



కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన యావత్ భారతదేశాన్ని కలచివేసింది. ఈ ఘటనకు ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌లపై ఇప్పటికే పలువురు ప్రముఖ నటీనటులు స్పందించారు. తాజాగా ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "భార్యతో కలిసి వేసవి సెలవుల కోసం పహల్గాం వెళ్లిన భర్తను ఉగ్రమూక కాల్చి చంపింది.తన భర్తను చంపవద్దని ఆ భార్య ఎంతగానో ఏడుస్తూ, ప్రాధేయపడినా ఆ ఉగ్ర ఉన్మాది వినలేదు. ఆమె కళ్ల ముందే భర్తను అతి కిరాతకంగా కాల్చి చంపాడు. ఆమెను విధవరాలని చేశాడు. భర్త మరణాన్ని తట్టుకోలేని ఆ భార్య... తనను కూడా చంపేయమని అడిగినా... 'నిన్ను చంపను... వెళ్లి చెప్పుకో..' అని ఆ రాక్షసుడు అన్నాడు. నా కుమార్తెలాంటి ఆమె మానసిక స్థితి చూస్తుంటే .. 'ఆమె వద్ద చితాభస్మం ఉన్నా... సిందూరం ఎక్కడ అని ప్రపంచం అడుగుతోంది' అని మా నాన్న (హరివంశ్ రాయ్ బచ్చన్) రాసిన ఓ పద్యంలోని వాక్యం నాకు గుర్తొచ్చింది. అందుకే నేను నీకు సిందూరం ఇస్తున్నా... అపరేషన్ సిందూర్... జై హింద్... భారత సైన్యమా... ఎప్పటికీ ఆగకు... వెనకడుగు వేయకు" అంటూ భావోద్వేగమైన ?పోస్ట్‌ను షేర్ చేశారు అమితాబ్ బచ్చన్.

## నందమూరి తారక రామారావు ఎంట్రీ




# సాయిపల్లవి గురించి ఇవి మీకు తెలుసా?



సాయిపల్లవి అసలు పేరు సాయిపల్లవి సెంథామరై కన్నన్.
తమిళనాడులో కోటగిరిలో జన్మించింది




1౯౯౨ మే ౦౯న బడగ కమ్యూనిటీలో పుట్టింది.
ఈమె ట్రైన్డ్ డ్యాన్సర్ కాదు



కస్తూరి మాన్ (౨౦౦౫), ధామ్ ధూమ్ (౨008) సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్ గా చేసింది.
౨015లో వచ్చిన మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో హీరోయిన్ అయిపోయింది




తెలుగులో ఈమె చేసిన మొదటి సినిమా ఫిదా.
ఒక్క మూవీతో టాలీవుడ్ లో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది



స్తుతం పాన్ ఇండియా మూవీ 'రామాయణ్'లో సాయిపల్లవి సీత పాత్ర చే
ఇది గనక హిట్ అయితే ఈమె రేంజ్ ఎక్కడికో వెళ్లిపోవడం గ్యారంటీ



సాయిపల్లవికి పూజా కన్నన్ అనే చెల్లి ఉంది.
ఈమె గతేడాది ప్రేమ వివాహం చేసుకుంది.
పూజా గతంలో ఓ తమిళ సినిమాలో నటించింది

# అందాలతో సెగలు పుట్టిస్తున్న సాక్షి మాలిక్..



Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com